
Follow: @ANNTELUGU
24-04-2025
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 143 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ముఖ్యమంత్రి రేవంత్‌కు ఘనస్వాగతం

**జపాన్ పర్యటన విజయవంతంగా ముగించుకుని వచ్చిన అధినేత**

శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు ఎంగేజ్మెంట్ వేడుకకు హాజరు

వివరాలు 5లో

**టాప్ న్యూస్**



### జనతా గ్యారేజ్‌లా బీఆర్ఎస్ మారింది

- వరంగల్ సభ చరిత్రలో నిలిచిపోతుంది
- ఎల్కతుర్తిలో కేటీఆర్

05



### ఉగ్ర దాడికి ధీటుగా బదులిస్తాం

- కేంద్ర రక్షణశాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ హెచ్చరిక
- పహల్గాం దాడి పిరికిపంద చర్య

02



### శనివారం పోప్ అంత్యక్రియలు

- పార్థివదేహాన్ని దర్శించుకు నేందుకు బుధవారం నుంచి అనుమతి
- పోప్ కోరిక మేరకు నిరాడంబరంగా సాగనున్న అంత్యక్రియలు

07



వాణిజ్య ఒప్పందంపై

### రోడ్‌మ్యాప్ సిద్ధం

- విధివిధానాలు అధికారికంగా ఖరారు
- ప్రధాని మోదీ అప్రూవల్ రేటింగ్స్ చూస్తే నాకు అసూయగా ఉంది
- అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్

వివరాలు 7లో



కర్ణాటక సీఎంను, డిప్యూటీ సీఎంను

### చంపేస్తాం

సిద్ధూ, డీకేలకు బెదిరింపు మెయిల్స్..!

వివరాలు 5లో



### త్వరలో ఎడారిగా పాక్

- ఇది మరోరకం సర్జికల్ స్ట్రైక్!
- పాకిస్థాన్ కు నీళ్ళు బంద్.. సింధు ఒప్పందం ఇదే

వివరాలు 2లో



పహల్గాం దాడి సూత్రధారి

### సైఫుల్లా సాజిద్

- పాక్ ఆర్మీ హస్తం
- ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో దురాగతం

వివరాలు 2లో



# భగ్గుమన్న భారతావని

## ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించిన దేశం


## దేశవ్యాప్తంగా దాడిపై నిరసనలు

సౌదీ పర్యటన రద్దుచేసుకుని హుటాహుటిన భారత్ కు ప్రధాని మోదీ

తాజా పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష.. సంచలన నిర్ణయాలు

ఒంటిచేత్తో యుద్ధం ఆపే పరమాత్మలు.. పహల్గాంలో పాశవిక దాడిని ఆపలేకపోయారు. కాశ్మీర్ వెళ్ళండి.. అందాలు ఆస్వాదించడం అంటూ ప్రకటించిన పాలకులు చరిత్రలో ఎన్నడూ చూపనంత నిఘా వైఫల్యానికి నిర్లక్ష్యానికి ఏం సమాధానం చెబుతారు? 'పో.. ఇక్కడ జరిగింది మోదీకి చెప్పు'.. నన్ను కూడా చంపేయండి అని తన భర్తను చంపిన ఉగ్రవాదుల ఎదుట రోదించిన మహిళకు ఓ ఉగ్రవాది ఇచ్చిన సమాధానమిది. పాకిస్థాన్ ఆర్మీచీఫ్ రెచ్చగొట్టుడు ధోరణితో జరిగిన నరమేధానికి భారత్ బదులు తీర్చుకోవాలని.. పాకిస్థాన్ ఆర్మీ కలలో కూడా భారత్ పేరెత్తకుండా చేయాలని దేశం గర్జించింది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై యావత్ దేశం భగ్గుమంది. పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు సహా దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత్ సీరియస్‌గా తీసుకుంది. పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ మీటింగ్‌లో పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్ పౌరులు వెంటనే భారత్‌ను వీడాలని కేంద్ర విదేశాంగ శాఖ తేల్చి చెప్పింది. పాకిస్థాన్ పర్యటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని ఆ దేశ పౌరులను భారత్‌లోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. సింధుజలాలు నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ముష్కరుల దాడికి నిరసనగా ర్యాలీలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణమని మాజీ సైనికులు మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దుచేసి, రాష్ట్రాల విభజన చేసి.. కేంద్రం ఏం సాధించిందని, మోదీకి చెప్పుకో..పో అని ఉగ్రవాదులు కాల్పుల్లో మరణించిన బాధిత కుటుంబాలతో అన్నారంటే ఆ తెంపరితనాన్ని తెంపాల్సిన, గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని అన్నారు. - మహా నెట్ వర్క్

వివరాలు 2,3లో



### ఎల్ఓసీ వెంట 42 ఉగ్రస్థావరాలు

కాశ్మీర్‌లో 115 మంది ఉగ్రవాదులు

పక్కా ప్లాన్‌తోనే ఇదంతా చేస్తున్నారా?

వివరాలు 3లో

### రెచ్చగొట్టాడు..

**నరమేధానికి కారణమయ్యాడు**

పాక్ ఆర్మీ చీఫ్ ఉసిగొల్పడం వల్లే.. సంఘటన అంతర్జాతీయ మీడియాలో వార్తలు

02

### ఉగ్రదాడితో కాశ్మీర్‌ను వీడుతున్న టూరిస్ట్‌లు

శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ నుంచి 3337 మంది పయనం

బెంబేలెత్తిపోతున్న పర్యాటకులు



**మహా:** జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడితో పర్యాటకులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని అనుక్షణం వణికిపోతున్నారు. ఈ క్రమంలోనే వెంటనే కాశ్మీర్‌ను ఖాళీ చేసి.. తమ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ కిక్కిరిసిపోయింది. విమానాల్లో వేలాది మంది టూరిస్ట్‌లు వెళ్లిపోతున్నారు. కేవలం 6 గంటల్లోనే ఏకంగా 3337 మంది పర్యాటకులు శ్రీనగర్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరినట్లు అధికారులు వెల్లడించారు.

మిగతా 2లో

### పాకిస్థాన్‌తో తెగదెంపులు

**పాకిస్థానీయులకు ఇక నో ఎంట్రీ**

పర్యాటకులు, పౌరులు ఎవరున్నా వెళ్లిపోవాలని ఆదేశం

సింధు జలాల ఒప్పందం నిలిపివేత..

అటారీ చెక్ పోస్ట్ బంద్.. కేంద్రం సంచలన నిర్ణయం



వివరాలు 2లో



### పీసీసీ పరిశీలకుల నియామకం

**పరిశీలకులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్ లు**

- సంస్థాగత ప్రక్రియ మొదలుపెట్టిన మీనాక్షి నటరాజన్
- గ్రామస్థాయి నుండి పార్టీ పటిష్టం.. మహిళలకు మరిన్ని అవకాశాలు
- మే 20వ తేదీలోగా గ్రామ, మండల స్థాయి అభిప్రాయ సేకరణలు పూర్తి.. ఫైనల్ చేయనున్న పీసీసీ
- గుజరాత్ మోడల్ లో డీసీసీల ఎంపిక.. త్వరలో ఏఐసీసీ పరిశీలకులు

05




రాష్ట్రంలో పంటల భీమా పథకం

### అమలుకు కసరత్తు

- రైతులందరికి ప్రయోజనం చేకూరేవిధంగా చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మహా:** వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి , వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు ఇతర అధికారులతో పంటల బీమా పథకం అమలుకు సంబంధించిన ప్రాథమిక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.

మిగతా 5లో



### కర్రె గుట్టల్లో.. టెన్షన్ టెన్షన్

**దండకారణ్యంలో తుపాకుల మోత**

చుట్టుముట్టిన మూడు వేల మంది పోలీసులు

ఛత్తీస్ ఘడ్, తెలంగాణ పోలీసుల సంయుక్త భారీ ఆపరేషన్

వివరాలు 5లో

### ప్రశాంతంగా ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్

- రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి
- 78.57 శాతం పోలింగ్

06

### బిడ్డను కంటే 5 వేల డాలర్లు!

**జననాల రేటు పెంచేందుకు అమెరికా కొత్త ప్రతిపాదన**

05

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
గురువారం, హైదరాబాద్ | 24-04-2025

# రెచ్చగొట్టాడు..

## నరమేధానికి కారణమయ్యాడు

### పాక్ ఆర్మీ చీఫ్ ఉసిగొల్పడం వల్లే.. సంఘటన అంతర్జాతీయ మీడియాలో వార్తలు



**మహా:** ప్రస్తుత పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలు కూడా ఉగ్రదాడికి పురిగొల్పాయన్న ప్రచారముంది. దీనికి తోడు జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి విదేశీ అతిథుల పర్యటనను ఉగ్రవాదులు వాడుకొంటున్నారనే అనుమానాలు బలంగా ఉన్నాయి. ప్రధాని విదేశీ పర్యటనలో ఉండటం.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటన కొనసాగుతున్న సమయంలో పహల్గాం దాడి చోటుచేసుకోవడం గమనార్హం.

**పుల్వామా దాడి వేళ మునీరే ఐఎస్ఐ అధిపతి**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి వెనక పాక్ కోణాన్ని విస్మరించలేం. ఇటీవల ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ చేసిన రెచ్చగొట్టే ప్రసంగమే ఈ దాడికి పురిగొల్పిందనే వాదనలు బలపర్చే ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన గొంతులోని రక్తనాళంలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథ చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు. మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకొంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి జరిగినప్పుడు మునీర్ పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతి. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఇప్పుడు ఆయనే ఆర్మీ చీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ఉగ్రమూకను ఉసిగొల్పుతున్నారు.

**లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ హస్తం**

ఇక పాక్ సైన్యానికి అనుబంధంగా పనిచేస్తుందని పేరున్న లష్కరే తోయిబా ఉగ్ర సంస్థ హస్తం ఈ దాడి వెనక ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సంస్థకు చెందిన కమాండర్ సైపుల్లా కుసురీ అలియాస్ ఖలీద్ ఈ దాడికి వ్యూహకర్తగా అనుమానిస్తున్నారు. ఇతడితోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఇద్దరు ఆపరేటివ్‌లు కూడా సహకరించినట్లు తెలుస్తోంది. ఇక దాడిలో పాల్గొన్న వారు లష్కరే ముసుగు సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్'కు చెందినవారు. వారు ఈ మారణ హోమం మొత్తాన్ని కెమెరాల్లో చిత్రీకరించినట్లు కూడా వార్తలొస్తున్నాయి.

**అంతర్జాతీయం చేయడానికి.. నాడు క్లింటన్ పర్యటన సమయంలో..**

20 మార్చి 2000లో అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పొరలో ఉగ్రవాదులు 36 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకొన్నారు. నాడు సిక్కు వర్గంలోని వారే ఉగ్రమూక లక్ష్యంగా మారారు. వాస్తవానికి అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ న్యూఢిల్లీ పర్యటనలో ఉన్నారు. నాడు జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే లక్ష్యంతోనే పాక్ ఈ దాడికి పాల్పడినట్లు భావించారు. నాడు ఉగ్రవాదులు భారీ తుపాకులు, రెండు సైనిక వాహనాల్లో ఛత్తీసింగ్‌పొర గ్రామంలోకి వచ్చారు. వారు ఇంటింటికీ తిరిగి తమను సైనిక సిబ్బందిగా చెప్పుకొని.. తనిఖీల నిమిత్తం పురుషులు బయటకు రావాలని ఆదేశించారు. ఆ తర్వాత వారందరినీ గురుద్వారా వద్ద ఉంచి కాల్చి చంపేశారు. సైన్యమే ఆ పని చేసిందన్నట్లు అక్కడివారిని నమ్మించేలా నినాదాలు చేశారు. చివరికి దర్యాప్తు సంస్థలు పాక్ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు గుర్తించాయి.

**జేడీ వాన్స్ సందర్శన సందర్భంగా**

పహల్గాం ఉగ్ర దాడికి.. గతంలో జరిగిన ఛత్తీసింగ్‌పొర నరమేధానికి దగ్గరి సంబంధాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీసమేతంగా పర్యటిస్తున్నారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. అదే సమయంలో పహల్గామ్‌లో పర్యటకులపై ఉగ్రవాదులు దాడి చేసినవారు భద్రతా దళాల దుస్తుల్లో వచ్చారు. పర్యటకుల ఐడీలను పరిశీలించి మరీ దాడి చేశారు. ఇక్కడా పురుషులనే లక్ష్యం చేసుకోవడం కుట్రకు అద్దం పడుతోంది.

# పాకిస్థాన్‌తో తెగదెంపులు



## పాకిస్థానీయులకు ఇక నో ఎంట్రీ

### పర్యాటకులు, పౌరులు ఎవరున్నా వెళ్లిపోవాలని ఆదేశం

### సింధు జలాల ఒప్పందం నిలిపివేత..

### అటారీ చెక్ పోస్ట్ బంద్.. కేంద్రం సంచలన నిర్ణయం

**ఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడులో మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రదాడికి ప్రతిగా కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్టు ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. కేబినెట్ భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలను భారత విదేశంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ మీడియాకు తెలిపారు.

**కీలక నిర్ణయాలివే..**

- 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ నిలిపివేసేంత వరకూ ఈ నిర్ణయం అమలు చేయనుంది.
- అటారి ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ తక్షణమే మూసివేత. ఇప్పటికే ఆ మార్గం ద్వారా వచ్చిన వారు 2025 మే 1లోగా తిరిగి వెళ్లవచ్చు.
- పాకిస్తాన్ పౌరులకు ఎస్ వీఈఎస్ వీసాలపై భారతదేశ ప్రవేశం నిషిద్ధం. ఇంతకుముందు జారీచేసిన ఎస్ వీఈఎస్ వీసాలు రద్దు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాక్ పౌరులు 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలి.
- న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకాదళ, వాయుసేన సలహాదారులను 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించి, వారిని వారంలోగా దేశం విడిచి వెళ్లమని ఆదేశించింది.
- భారత హైకమిషన్, ఇస్లామాబాద్ నుంచి భారత్ తన సలహాదారులను వెనక్కి పిలుపు తీసుకుంది. ఈ పదవులను రద్దు చేసింది. అలాగే 5 మంది సపోర్ట్ స్టాఫ్ కూడా వెనక్కి పిలిపించనుంది.
- భారత్, పాకిస్తాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గించనుంది. ఈ మార్పులు 2025 మే 1లోగా అమల్లోకి వస్తాయి.
- సీసీఎస్ దేశ భద్రతా పరిస్థితిని సమీక్షించింది. అన్ని భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్న ఆదేశాలు ఇచ్చింది.
- ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టానికి లోబడి శిక్షించడమే కాక, వారికి మద్దతు ఇచ్చిన వారినీ చర్యలను బహిరంగంగా బహిర్గతం చేసి చర్యలు తీసుకుంటామని సంకల్పించింది.
- తహవ్వూర్ రాణాను భారతదేశానికి అప్పగించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదం పట్ల కఠినమైన ధోరణిని భారత్ కొనసాగిస్తుందని స్పష్టం చేసింది.

## శ్రీనగర్‌లో చిక్కుకుపోయాం..

# స్వస్థలాలకు పంపండి

### ప్రభుత్వానికి తెలంగాణ పర్యాటకుల విజ్ఞప్తి

**మహా:** పహల్గాం ఉగ్రదాడితో ఆందోళనలో ఇప్పటికే కశ్మీర్‌లో ఉన్న పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. భద్రతా దళాలు అప్రమత్తమై భరోసా ఇస్తున్నా వీరు మాత్రం ఆందోళనలో ఉన్నారు. అక్కడున్న వారిలో తెలంగాణ పర్యాటకులు 80 మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం శ్రీనగర్‌లోని ఓ హోటల్‌లో ఉన్నారు. వీరంతా జమ్మూ కశ్మీర్ పర్యాటక ప్రాంతాల్లో విహరించేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మంగళవారం శ్రీనగర్ వెళ్లారు. ఉదయం 7 గంటలకు వీరంతా జమ్మూకు బయల్దేరారు. ఉదయం 10.30కు జమ్మూ చేరుకున్న వీరు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీనగర్ చేరుకున్నారు. ఉగ్రదాడితో కర్ఫ్యూ విధింపుతో వీరంతా హోటల్‌లోనే ఉండిపోయారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం వీరంతా పహల్గాం పర్యటనకు వెళ్లాల్సి ఉంది. తిరిగి ఈనెల 26న టూర్ ముగించుకుని స్వస్థలాలకు రావాలని ప్లాన్ చేసుకున్నారు. ఉగ్రదాడితో పర్యాటకులందరూ శ్రీనగర్‌లోనే ఉండిపోయారు.

**వివిధ జిల్లాల వాసులు**

జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే తమను స్వస్థలాలకు చేర్చాలని



వీరంతా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీనగర్‌లో చిక్కుకున్న వారిలో హైదరాబాద్, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా వాసులు ఉన్నారు.

**కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి - కేటీఆర్ డిమాండ్**

తెలంగాణకు చెందిన 80 మంది పర్యాటకులు శ్రీనగర్‌లో చిక్కుకుపోయాయిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందించారు. శ్రీనగర్‌లో చిక్కుకున్న వారిని రప్పించేందుకు చర్యలు చేపట్టాలని, స్వస్థలాలకు రప్పించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కేటీఆర్ ఎక్స్ వేదికగా కోరారు. రాష్ట్ర పర్యాటకులకు తగిన సహాయం అందించాలని సీఎంను కోరుతున్నానని అన్నారు.

## టెర్రరిస్టుల ఊహాచిత్రాలు విడుదల చేసిన సెక్యూరిటీ ఏజన్సీలు

**మహా :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన టెర్రరిస్టుల ఊహాజనిత ఫోటోలను కేంద్ర ప్రభుత్వం షేర్ చేసింది. మొత్తం ఐదుగురు టెర్రరిస్టులు ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం. వారిలో ముగ్గురి ఊహా చిత్రాలను కేంద్రం విడుదల చేసింది. ముగ్గురు ఉగ్రవాదులను ఆసిఫ్ పుజి, సులేమాన్ షా, అబు తల్హాగా గుర్తింపు. మరోవైపు ఆ దాడిలో పాల్గొన్న మరో ఉగ్రవాది ఫొటోను సైతం ఇప్పటికే విడుదల చేసిన సంగతి తెలిసిందే.



## ఉగ్ర దాడికి ధీటుగా బదులిస్తాం

### కేంద్ర రక్షణశాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ హెచ్చరిక

### పహల్గాం దాడి పిరికిపంద చర్య

**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడుల వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టబోమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిపై రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల పిరికిపంద చర్యతో అమాయకులు ప్రాణాలను కోల్పోయారు. ఈ దుర్ఘటన నన్ను కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను. ఉగ్రవాదంపై దేశం సంకల్పాన్ని పునరావృతం చేయాలనుకుంటున్నాను. భారత్‌ను ఎవరూ భయపెట్టలేరు. ప్రభుత్వం అవసరమైన ప్రతి చర్య తీసుకుంటుందని దేశ ప్రజలకు నేను హామీ ఇస్తున్నాను. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని మాత్రమే కాదు, తెరవెనుక ఉన్న ఎంతటివారినైనా ఉపేక్షించబోం. ప్రతీకారం తీర్చుకుంటాం'అని హెచ్చరించారు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా.. వారి వెనుక ఎవరున్నా ఉగ్రవాద దాడి తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా పరిస్థితిని సమీక్షించేందుకు త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ సింగ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎకె సింగ్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాతే పహల్గాంలో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా.. వారి వెనుక ఎవరున్నా విడిచి పెట్టమంటూ ఘాటుగా స్పందించారు.

# పహల్గాం దాడి సూత్రధారి సైపుల్లా సాజిద్

### పాక్ ఆర్మీ హస్తం.. ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో దురాగతం

**శ్రీనగర్:** పహల్గాం దాడి వెనుక సూత్రధారి సైపుల్లా సాజిద్ ఉన్నట్టు తెలిసింది. దాడులకు పాల్పడింది తామేనని లష్కర్‌ఏతోయిబా ముసుగు సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ ప్రకటించుకుంది. అంతకుముందు సైపుల్..లా ముజాహిదీలు కశ్మీర్‌లో దాడులు చేస్తారని ముందుగానే ప్రకటించాడు. త్వరలో కశ్మీర్ తమ గుప్పిట్లోకి వస్తుందన్న సైపుల్లా చెప్పుకొచ్చాడు. దానికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. మరోవైపు.. ఈ దాడుల వెనుక పాకిస్థాన్ హస్తం కూడా ఉన్నట్టు సమాచారం. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ చేసిన వ్యాఖ్యలు ఇందుకు ఆధారంగా ఉన్నాయి. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ మాట్లాడుతూ.. కశ్మీర్‌ను పాకిస్థాన్ ఎప్పటికీ మర్చిపోదని, కశ్మీరీలను ఒంటరిగా వదిలిపెట్టబోము. ఇస్లామాబాద్‌కు కశ్మీర్ అంటే గొంతుకు వెళ్లే రక్తనాళం వంటిది. ప్రతీ విషయంలో మనం హిందువులకంటే విభిన్నమైన వారిమని మన పూర్వీకులు నమ్మారు. మన మతం విభిన్నం. మన ఆచారాలు, సంస్కృతులు, ఆలోచనలు, ఆశయాలు పూర్తిగా భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనం రెండు



విభిన్న దేశాలు, ఒకటి కాదు అని నమ్మారు కాబట్టే ఈ సిద్ధాంతం పుట్టింది. అందుకే పాకిస్థాన్ చరిత్రను మరిపోవద్దని మీ పిల్లలకు కచ్చితంగా చెప్పాలి. ఈ దేశాన్ని ఏర్పాటు చేయడానికి మన పూర్వీకులు చాలా త్యాగాలు చేశారు. మనం కూడా చేశాం. ఈ దేశ చరిత్రను మరిచిపోవద్దని ప్రతిఒక్కరినీ కోరుతున్నాను అంటూ వ్యాఖ్యలు చేశారు.

**ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో..**

పహల్గాం దాడి ఘటనపై జమ్ముకశ్మీర్ మాజీ డీజీపీ శేష్‌పాల్ వైద్ స్పందిస్తూ.. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో ఉంది. రెండు రోజుల క్రితం పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీస్ భారత్‌పై చాలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవేవో యాదృచ్ఛికంగా అన్నమాటలు కావు. ఎందుకంటే ఉగ్రవాదులు పర్యటకుల మతాన్ని అడిగి, ఎవరైతే ముస్లింలు కారో వారిని మాత్రమే చంపారు. హమాస్ దాడిని ఇజ్రాయెల్ ఎలా తిప్పికొట్టిందో, భారత్‌కు అలానే చేయాలి. వాస్తవానికి ఈ ఉగ్రదాడిని పాకిస్థాన్ సైన్యం ప్రారంభించింది. ఎందుకంటే దాడి చేసింది ఉగ్రవాదులు కాదు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైన్యంలోని ఎస్ఎస్‌జీ (స్పెషల్ సర్వీస్ గ్రూప్) కమాండోలు ఈ దాడులకు పాల్పడ్డారు. ఇది ఒక పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన దాడి. ఇక మనం చాలా అప్రమత్తంగా ఉండాల్సిందే. వాస్తవానికి ఈ ఉగ్రదాడి అంతా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఆదేశాలతోనే జరుగుతోంది. పైగా ఈ తరహా దాడులను మరింత తీవ్రతరం చేయాలని ఆయన అనుకుంటున్నారు. అతను తానేంటో నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఉగ్రదాడితో కాశ్మీర్‌ను వీడుతున్న టూరిస్టులు

### శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ నుంచి 3337 మంది పయనం

### బెంబేలెత్తిపోతున్న పర్యాటకులు

(మొదటి పేజీ తరువాయి)

పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన భీకర కాల్పుల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్‌లో పర్యటిస్తున్న టూరిస్ట్‌ల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో ఉన్నఫలంగా కాశ్మీర్‌ను ఖాళీ చేసి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం నుంచి కేవలం 6 గంటల్లోనే 3 వేల మందికి పైగా టూరిస్ట్‌లు శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ నుంచి 20 విమానాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రస్తుత పరిస్థితిని అదునుగా చేసుకుని విమాన టికెట్ ధరలు భారీగా పెంచేసే ఎయిర్‌లైన్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

**ఒక్కసారిగా పెరిగిన టికెట్ల ధరలు..**

శ్రీనగర్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరే ప్రయాణికుల రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మంగళవారం జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగినట్లు కేంద్రమంత్రి దృష్టికి వెళ్లింది. ఢిల్లీ, ముంబై లాంటి నగరాలకు శ్రీనగర్ నుంచి వెళ్లే విమానాలకు సంబంధించిన టికెట్ల ధరలు ఒక్కసారిగా రూ.20 వేలు దాటిపోయాయి. అంతేకాకుండా ఆన్‌లైన్ పోర్టల్స్‌లో టికెట్లు మొత్తం అయిపోయినట్లు చూపిస్తున్నాయని ప్రయాణికులు



తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీనగర్‌లో చిక్కుకున్న ప్రయాణికులను తిరిగి వారి స్వస్థలాలకు వెళ్లేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందుకోసం అదనపు విమానాలు నడుపుతున్నట్లు వెల్లడించారు. మొదట శ్రీనగర్ నుంచి ఢిల్లీ, ముంబై నగరాలకు రెండు విమానాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మరిన్ని విమానాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇక శ్రీనగర్ నుంచి వెళ్లే ప్రయాణికులు తమ టికెట్లను క్యాన్సిల్ గానీ, రీ షెడ్యూల్ గానీ చేసుకుంటే ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ఎయిర్‌లైన్ సంస్థలకు సూచించారు.

# త్వరలో ఎడారిగా పాక్

### ఇది మరోరకం సర్జికల్ స్ట్రైక్!

### పాకిస్థాన్ కు నీళ్ళు బంద్.. సింధు ఒప్పందం ఇదే

**మహా:** జమ్ముకశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి భారత్ తో పాటు ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ భీకర ఉగ్రదాడిలో 26మంది పౌరులు మరణించారు. ఈ సమయంలో ఈ దాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. పాక్ కు దిమ్మతిరిగేలా.. ఇప్పట్లో కోలుకోలేని రీతిలో షాకిచ్చే నిర్ణయాలు తీసుకుంది. పాక్ గతంలో భారత్ పై ఎన్నోసార్లు ఉగ్రదాడి చేసింది! అయితే... ఈ చర్యలపై భారత్ పలుమార్లు శాంతి మంత్రం జపించగా.. అనంతరం కొన్ని ప్రతిదాడులు చేసింది! అంతేకానీ సాధారణ ప్రజల్ని ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశ్యంతో సింధూ నదీ జలాల జోలికి వెళ్లలేదు. కానీ... ఇప్పుడు వెళ్లింది. తాజాగా పహల్గం ఘటన తర్వాత పాక్ కు దిమ్మతిరే షాక్ ఇచ్చింది భారత్. ఇందులో భాగంగా సింధూ జలాల సహకారాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో.. త్వరలో పాకిస్థాన్ ఎడారిగా మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. కారణం.. ఈ జలాలపైనే ఆ దేశంలోని పలు రాష్ట్రాలు ఆధారపడి ఉన్నాయి.

**సింధు జలాల ఒప్పందం ఇదే:**

1960 సెప్టెంబర్ 19న అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ల మధ్య ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంలో భాగంగా సింధు నదీ జలాలపై ఓ ఒప్పందం కుదిరింది. ఇందులో



భాగంగా... భారత్ కి తూర్పు నదులు రావి, సట్లేజ్, బియాస్ లపైనా... పాకిస్థాన్ కు పడమర నదులైన సింధు, జీలం, చినాబ్ నదులపైనా నియంత్రణ ఉంటుంది. దీంతో.. భారత్ లో ఉన్న సింధు నదుల వ్యవస్థ ద్వారా ప్రవహించే మొత్తం నీటిలో భారత్ సుమారు 30% పొందగా.. మిగిలిన 70%పాక్ కు లభించింది. అయితే.. ఈ ఒప్పందం పశ్చిమ నదుల నీటితో విద్యుత్ ఉత్పత్తి, చేపల పెంపకం మొదలైన ఉపయోగాల కోసం ఉపయోగించుకోవడానికి అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఈ ఒప్పందం వల్ల భారత్ కంటే ఎక్కువగా పాకిస్థాన్ లబ్ధి పొందుతుందనే వాదన ఉంది. ఈ క్రమంలో... 2016లో ఉరి ఉగ్రదాడి అనంతరం స్పందించిన ప్రధాని మోదీ... రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని వ్యాఖ్యానించారు. తర్వాత 2023లో నాటి ఒప్పందంపై మరోసారి చర్చించాల్సిందిగా పాక్ కు తెలియజేశారు. అయితే.. పాక్ మాత్రం 1960 నాటి ఒప్పందానికే కట్టుబడి ఉండాలని కోరింది. ఈ నేపథ్యంలో తాజా ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో.. భారత్ నుంచి వెళ్లే జలాలు అందక.. పాకిస్థాన్ ఎడారిగా మారడం ఖాయం అని అంటున్నారు. ప్రపంచంలో అతి తక్కువ నీటి వనరులున్న దేశాల్లో ఒకటైన పాక్ కు సింధు నదీ జలాలే ప్రధాన వనరు.





# భద్రతా బలగాల కన్నుగప్పి.. రెక్కీ

## దాడి వెనుక ప్రొఫెషనల్ స్కెచ్

**మహా:** ఎంతో కాలంగా రెక్కి నిర్వహించి.. డెత్‌స్పాట్‌ను డిసైడ్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇంతకూ భద్రతా బలగాల కన్నుకప్పి బైసరన్ వ్యాలీలోకి ఉగ్రవాదులు ముందుగా ఎలా వెళ్లారు..? ఎన్నిరోజుల నుంచి అక్కడ మకాం పెట్టారు..? పహల్గామ్ దాడి.. ఏదో అషామాషీగా జరిగిన అటాక్ అయితే కాదు. దీనివెనుక పక్కా ప్రొఫెషనల్ స్కెచ్ ఉన్నట్లు దాడి జరిగిన తీరు చూస్తే స్పష్టమవుతోంది. మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో.. పహల్గామ్‌లోని బైసరన్ వ్యాలీ, పర్యాటకులతో కిటకిటలాడుతోంది. కొందరు గుర్రాలపై సవారీ చేస్తుంటే, మరికొందరు పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ ఫోటోలు తీసుకుంటూ ఎంజాయ్ చేస్తున్న సమయం. అకస్మాత్తుగా, సైనిక యూనిఫాంలలో ఉన్న ఆరుగురు ఉగ్రవాదులు దట్టమైన అడవుల నుంచి ప్రత్యక్షమయ్యారు. అయితే ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో ఎవరికీ అనుమానం రాలేదు. సైనికుల్లా వ్యవహరిస్తూ.. అక్కడున్న పర్యాటకుల మతం, పేరును విచారిస్తూ వచ్చారు. కొందరు ఇస్లామిక్ కల్మా చదవమన్నారు. ఆ తర్వాత ఓ వర్గం టార్గెట్‌గా ఎకె47 రైఫిళ్లతో విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. క్షణాల్లో ఆ పచ్చని లోయ రక్తసిక్తమైంది.

ఉగ్రవాదులు ఎంతగా పర్యాటకులను భయపెట్టారంటే.. నిజమైన భారత ఆర్మీని చూసినా ప్రజలు గజగజవణికిపోయేంతలా..! ఉగ్రదాదులు సమాచారం అందగానే భారత్ ఆర్మీ హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుంది. అయితే పర్యాటకులను రక్షించడానికి ప్రయత్నిస్తుండగా అక్కడున్న మహిళలు, పిల్లలు సైనికులను కూడా ఉగ్రవాదులే అనుకుని భయంతో వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ ఆర్మీ దుస్తుల్లో తమపై దాడి చేయడానికి వచ్చారని వణికిపోయారు. సైనికులను చూసిన ఓ మహిళ తన పిల్లలను ఏమీ చేయవద్దంటూ చేతుల జోడించి వేడుకుంది. ఇతర పర్యాటకులు కూడా భయంతో తమ పిల్లలను దాచేందుకు ప్రయత్నించారు. అయితే ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్తూ.. తాము భారత ఆర్మీగా పరిచయం చేసుకుంటూ..మిమ్మల్ని రక్షించడానికే ఇక్కడికి వచ్చామని భరోసా ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. బైసరన్ వ్యాలీ.. ఇది ఎత్తైన కొండప్రాంతం. ఇక్కడకు వెళ్లాలంటే జీపులు, బైకులు లాంటివి పనిచేయవు. పహల్గామ్ బస్ స్టాండ్ నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉండే.. ఈవ్యాలీకి కాలినడకన కానీ గుర్రంపై కానీ చేరుకోగలరు. ఇదే ఉగ్రవాదులకు అవకాశంగా మారింది. ఈప్రాంతాన్ని ఉగ్రవాదులు ఎంచుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. అంతేకాదు ముందుగా రెక్కీ కూడా నిర్వహించారని అనుమానిస్తున్నారు.

ఎందుకంటే దాడి సమయంలో ఉగ్రవాదుల వ్యూహం, సైనిక యూనిఫాంలు, పర్యాటకులను గుర్తించే విధానం, ఎక్కడి నుంచి బయటకు రావాలి, ఎలా దాడి చేయాలి, ఇవన్నీ ఉగ్రవాదుల పక్కా ప్రణాళికగా అటాక్ చేసినట్లు స్పష్టం చేస్తున్నాయి. ఇద్దరు ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి వచ్చినవారిగా భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరో ఇద్దరు స్థానికులైన ఆదిల్, ఆసిఫ్ గా గుర్తించారు. అంతేకాదు ఈహత్యాకాండను టెర్రరిస్టులు బాడీ కెమెరాలతో రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు బాడీ కెమెరాలను ఉపయోగించి.. దాడి దృశ్యాలను రికార్డ్ చేశారని సమాచారం. ఈ వీడియోలు భవిష్యత్తులో ఉగ్రవాద సంస్థలు తమ ప్రచారం కోసం ఉపయోగించే అవకాశం ఉంది... కశ్మీర్ అంటేనే పర్యాటకానికి స్వర్గధామం.. 2024లో 35 లక్షల మంది పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శించారు. గత దశాబ్దకాలంగా ఉగ్రవాదం వల్ల పూర్తిగా కుంగిపోయిన పర్యాటక రంగానికి పునర్జన్మనిచ్చింది. కానీ, ఈ దాడి తర్వాత, పహల్గామ్‌లోని హోటళ్లు, గుర్రపు సవారీలు, స్థానిక వ్యాపారాలు ఒక్కసారిగా మూతబడ్డాయి. ఉగ్రదాడి సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ భారతదేశంలో నాలుగు రోజుల పర్యటనలో ఉన్నారు. ఈ సంఘటన 2000 మార్చి 20న జరిగిన చిత్తిసింగ్‌పురా ఊచకోతను గుర్తు చేస్తోంది. అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో ఉన్న సమయంలో 36 మంది సిక్కులను అత్యంత దారుణంగా హత్య చేశారు. అంతర్జాతీయంగా తమ ఉనికిని చాటుకునేందుకు ఉగ్రవాదులు ఈదాడికి తెగబడ్డారు. ఇప్పుడు, జేడి వాన్స్ పర్యటన సమయంలో జరిగిన ఈ దాడి కూడా అదే మోటివ్‌తోనే జరిగిందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..ఈ దాడిని ఖండిస్తూ.. భారత్‌తో కలిసి ఉగ్రవాదాన్ని ఎదిరిస్తామని ప్రకటించారు. ఇటు భారత్ కూడా ఉగ్రతండాలకు హెచ్చరికలు పంపింది. ఈదాడికి ప్రతికార చర్య తప్పక ఉంటుందని, త్వరలోనే దీనికి బాధ్యులైనవారి అంతు తేలుస్తామని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, కశ్మీర్‌లో రాజకీయ, సామాజిక పరిస్థితులు గణనీయంగా మారాయి. 370రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించబడింది, పహల్గామ్ అటాక్ కేవలం ఒక ఉగ్రదాడిగానే కాదు...ఇది కశ్మీర్ సోల్‌పై జరిగిన దాడిగా కశ్మీర్ సమాజం చూస్తోంది. స్థానికుల జీవనోపాధిని, పర్యాటకుల భద్రతను, కశ్మీర్ శాంతిని ప్రశ్నార్థకం చేసింది. అయితే కశ్మీర్ ప్రజలు, భారత ప్రభుత్వం, అంతర్జాతీయ సమాజం ఉగ్రవాదులను ఎదిరించేందుకు ఒక్కటయ్యాయి.

# ఈ దుఃఖాన్ని ఆపడం ఎవ్వరి తరము?

## కన్నీరు పెట్టిస్తున్న దృశ్యాలు

**మహా:** జమ్మూకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్ర దాడి యావత్ దేశాన్ని కుదిపేసింది. మినీ స్విట్జర్లాండ్ బైసరన్ లోయలో మంగళవారం జరిగిన మారణ హోమం పలువురి కంటతడి పెట్టిస్తోంది. ఈ సంఘటనకు భయానక వివరాలు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. హనీమూన్‌కి వచ్చి ఒకరు, సెలవులకోసం వచ్చి ఒకరు ఇలా 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న వైనాన్ని దేశమంతా ఖండించింది. 8 ఏళ్ల శిశువు నుండి నావికాదళ అధికారి వరకు, 22 మంది పర్యాటకులు, ఇద్దరు విదేశీయులు ,ఇద్దరు స్థానికులు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో తండ్రి కోల్పోయిన చిన్నారి హృదయ విదారకంగా రోదిస్తున్న వీడియో కన్నీళ్లు పెట్టిస్తోంది. ఉగ్రమూకలు రెచ్చిపోయి పర్యాటలకు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. దీంతో ప్రాణ భయంతో అనేకమంది పరుగులు తీశారు. 26 మంది తూటాలకు నేలకొరిగారు. ఇలా తండ్రిభౌతిక దేహం మీద ఒక చిన్నారి రోదిస్తున్న వీడియో నెటిజనుల గుండె పిండేసింది. అతణ్ని రక్షించి తీసుకెళ్లుతుండగా, ఆ చిన్నారి రోదన ముఖ్యంగా అమ్మకావాలి అటూ ఏడుస్తున్న దృశ్యాలు హృదయ విదారకం ఉన్నాయి. ఈ ఘటన అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా దాడి జరిగిన ప్రదేశానికి చేరుకుని, బాధితులకు నివాళులర్పించారు. దేశం ఉగ్రవాదానికి తలొగ్గదని, దోషులను వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను కూడా ప్రకటించారు.





# ఇక పాకిస్థాన్ ఖేల్ ఖతం

## సంచలన నిర్ణయం దిశగా ప్రధాని మోదీ

**మహా :** జమ్ముకశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన ఘాతుకానికి దేశం ఉలిక్కి పడింది. పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమానికి అభం శుభం తెలియని 26 మంది పర్యాటకులు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చిన టెర్రరిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. కాల్పుల శబ్దం విన్న భద్రతా బలగాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఉగ్రమూకల కోసం వేట మొదలు పెట్టాయి. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఈ ఘటనను పిరికిపంద చర్యగా అభివర్ణించారు. అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఘటనను అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే పహల్గాం చేరుకున్న భారత హోం మంత్రి అమిత్ షా మృతదేహాలకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపి ఓదార్చారు. అయితే ఉగ్రమూకలు జరిపిన ఈ దాడిపై ప్రధాని మోదీ ఏం నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉత్కంఠంగా మారింది. అతి త్వరలోనే ప్రధాని మోదీ సంచలన నిర్ణయం తీసుకుంటారని భద్రతా బలగాలతోపాటు దేశ ప్రజలు భావిస్తున్నారు. గతంలో 2016లో భారత సైనిక స్థావరంపై ఉగ్రమూకలు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 19 మంది సైనికులు మరణించారు. ఆ ఘటనకు ప్రతీకారంగా ప్రధాని మోదీ పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ ప్రకటించారు.

### ఉరి సర్జికల్ స్ట్రైక్

2016లో పాక్ ఆక్రమిత కశ్మీర్ లో భారత సైన్యం చేసిన ఒక సైనిక చర్య. ఇది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుంది. 2016 సెప్టెంబర్ లో ఉరిలో భారత సైనిక శిబిరంపై ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఈ దాడి జరిగింది. మళ్లీ అలాంటి సర్జికల్ స్ట్రైక్ కు ప్రధాని మోదీ నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. అదే కానీ జరిగితే పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఉగ్రమూకలను ఏరి పారేయవచ్చని కాశ్మీర్ కు చెందిన మాజీ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ పైనా కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాశ్మీర్, పీఓకే ప్రాంతంలో ఉగ్రవాదుల ఏరివేతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాశ్మీర్ పరిస్థితులను ప్రధానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ వివరించారు. మరోవైపు త్రివిధ దళాధిపతులతో రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కేంద్ర కేబినేట్ కీలక భేటీ నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్లు సంకేతలు ఇచ్చినట్లు సమాచారం.





# ఎల్ఓసీ వెంట 42 ఉగ్రస్థావరాలు

## కాశ్మీర్‌లో 115 మంది ఉగ్రవాదులు.. పక్కా ప్లాన్‌తోనే ఇదంతా చేస్తున్నారా?

**మహా:** ఉగ్రదాడితో దేశం అంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడి దేశాన్ని నివ్వెరపరిచింది. ముఖ్యంగా భారత బలగాలు, పోలీసులు అయితే అంత మంది చనిపోవడంతో ఉగ్రవాదులను పట్టుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈక్రమంలోనే దేశంలో ఎంత మంది ఉగ్రవాదులు ఉన్నారు, జమ్ము కశ్మీర్‌లో ప్రస్తుతం ఎన్ని ఉగ్ర స్థావరాలు ఉన్నాయి వంటివి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎల్ఓసీ వెంట మొత్తంగా 42 ఉగ్ర స్థావరాలు (లాంచ్ ప్యాడ్స్) ఉండగా.. దేశ వ్యాప్తంగా 125 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. అయితే జమ్ము కశ్మీర్‌లోనే మొత్తంగా 115 మంది పాకిస్థానీ టెర్రరిస్టులు ఉన్నట్లు భద్రతా సంస్థలు వెల్లడిస్తున్నాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆధారంగా జమ్ము ఎదుర్కొంటున్న 32 ఉగ్ర స్థావరాల్లో (నియంత్రణ రేఖలోని చిన్న గ్రామాలు) 100 మంది ఉగ్రవాదులు ఉన్నారని తెలుస్తోంది. అలాగే వీరు వీలు దొరికితే దేశంలోకి చొరబడేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని అధికారులు తెలిపారు. మరోవైపు కాశ్మీర్‌కు ఎదురుగా ఉన్న 10 లాంచ్ ప్యాడ్లలో 35 మంది ఉగ్రవాదులు ఉన్నట్లు చెప్పారు. గత ఆరు నెలల్లో 50 చొరబాటు ప్రయత్నాలు జరగ్గా.. అధికారులు తిప్పి కొట్టినట్లు పేర్కొన్నారు. మరికొంత మంది ఉగ్రవాదులు దక్షిణం వైపునుంచి చొరబడి కశ్మీర్ వైపు కదిలినట్లు వివరించారు. ఇలా ప్రస్తుతం కాశ్మీర్‌లో 75 మంది ఉగ్రవాదులు ఉండగా.. జమ్ము ప్రాంతంలో 50 మంది ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తంగా 125 మంది టెర్రరిస్టులు ఉండగా.. అందులో పాకిస్థాన్‌కు చెందిన వారే 115 మంది అని చెప్పారు. అలాగే కేవలం 10 మంది మాత్రమే స్వదేశీయులుగా పెరిగారని పేర్కొన్నారు. అయితే ఈ ఉగ్రవాదులు అందరికీ సాంకేతిక సాయం కూడా లభిస్తోందని.. డ్రోన్ల ద్వారా ఆయుధాల పంపిణీ జరుగుతుందని చెప్పుకొచ్చారు. 2023లో మొత్తంగా 125 డ్రోన్లు స్వాధీనం చేసుకున్నామని, గతేడాది భద్రతా బలగాలు 300 డ్రోన్లను గుర్తించినట్టు స్పష్టం చేశారు.

మహా పత్రిక
MAHAA telugu
గురువారం, హైదరాబాద్
24-04-2025




మహా ప్రత్యేకం
MAHAA SPECIAL

# నెత్తుటి మంచు
## భగ్గుమన్న భారతావని

జమ్ముకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై యావత్ దేశం భగ్గుమంది. పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు సహా దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించారు. ముష్కరుల దాడికి నిరసనగా శ్రీనగర్, డొగ్రా, కంగన్ సహా జమ్ముకశ్మీర్‌లో పలు ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకోవాలని నినాదాలు చేశారు.

- మహా నెట్ వర్క్

### నెత్తుటేరులు

మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో, దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. ఈ ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఇద్దరు ముష్కరులను మట్టుపెట్టాయి. మిగతా ఉగ్రవాదుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

### ఉగ్రవాదులను వదిలిపెట్టం: అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇంత ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టం అని స్పష్టం చేశారు.

## పహిల్గామ్ ఉగ్రదాడి.. మృతుల జాబితా ఇదే

జమ్ముకశ్మీర్, పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన నరమేధంలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది వివరాలతో అధికారులు ఓ జాబితాలో తయారు చేశారు. మృతుల్లో ఐఏఎఫ్ కార్పోరల్, నేవీ, ఎక్సైజ్ అధికారితో పాటు కర్ణాటకకు చెందిన ఓ వ్యాపారవేత్త కూడా ఉన్నారు. అయితే మృతుల్లో ఎక్కువ మంది (ఆరుగురు) మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు. ఉగ్రదాడికి బలైన వారిలో గుజరాత్-3, కర్ణాటక-3, పశ్చిమ బెంగాల్-3 ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. ఒక నేపాలీ వ్యక్తి కూడా ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించారు. అంతేకాదు పాక్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో పహల్గాంకు చెందిన ఓ స్థానికుడు కూడా ఉన్నారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఉగ్రవాదులు పర్యటకులను ఒక్కదగ్గరకు చేర్చి, వారి వివరాలు అడిగారు. కల్మా చదవమని అడిగారు. తరువాత ముస్లింలు కాని పురుషులను ఒక్కొక్కొరిగా చంపుతూ పోయారు.

**పహల్గాం దాడిలో మరణించిన వారి జాబితా!**

1. దిలీప్ దేసాలే - మహారాష్ట్ర, ముంబయి
2. హేమంత్ జోషి సుహాస్ - మహారాష్ట్ర, ముంబయి
3. అతుల్ శ్రీకాంత్ మోని - మహారాష్ట్ర, థానే
4. సంజయ్ లక్ష్మణ్ లేలే - మహారాష్ట్ర, థానే
5. సంతోష్ జగ్దాలే - మహారాష్ట్ర, పుణె
6. కస్టోబే గనోవోటే - మహారాష్ట్ర, పుణె
7. బిటన్ అధికారి - పశ్చిమ బెంగాల్, కోల్‌కతా
8. సమీర్ గుహ - పశ్చిమ బెంగాల్, కోల్‌కతా
9. మనీశ్ రంజన్ (ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్) - పశ్చిమ బెంగాల్, పురులియాలోని ఝల్దా
10. మధుసూదన్ సోమిశెట్టిరావు - కర్ణాటక, బెంగళూరు
11. భరత్ భూషణ్ - కర్ణాటక, బెంగళూరు
12. మంజునాథరావు - కర్ణాటక, శివమొగ్గ
13. యతీశ్ పర్మార్ - గుజరాత్, భావ్‌నగర్
14. సుమిత్ పర్మార్ (యతీశ్ కుమారుడు) - గుజరాత్, భావ్‌నగర్
15. సైలేష్ భాయ్ కలథియా - గుజరాత్, సూరత్
16. వినయ్ నర్వాల్ (నేవీ అధికారి) - హరియాణా, కర్నాల్
17. ఎన్. రామచంద్రన్ - కేరళ, కొచ్చి
18. దినేశ్ అగర్వాల్ - చండీగఢ్
19. సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా - జమ్మూకశ్మీర్, పహల్గామ్
20. నీరజ్ ఉద్వానీ - ఉత్తరాఖండ్
21. జేఎస్ చంద్రమౌళి - ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం
22. సుశీల్ నాథ్యాల్ - మధ్యప్రదేశ్, ఇండోర్
23. ప్రశాంత్ సతపతి - ఒడిశా, బాలేశ్వర్
24. టేజ్ హాల్వింగ్ (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కార్పొరల్) - అరుణాచల్‌ప్రదేశ్, జిరో
25. శుభం ద్వివేదీ - ఉత్తరప్రదేశ్, కాన్పూర్
26. సుదీప్ సోయిపాని - నేపాల్, రూపందేహి



# సంస్థాగత పటిష్టతపై ఏఐసీసీ దృష్టి

## డీసీసీలు కొలిక్కి.. రాష్ట్ర కార్యవర్గం కూడా..

### గ్రామ స్థాయి నుండి జిల్లా వరకు పార్టీ బలోపేతానికి కార్యాచరణ

### ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కసరత్తు

### సోషల్ మీడియాలో జాబితాపై ప్రచారం.. కరెక్ట్ కాదన్న పీసీసీ చీఫ్



**హైదరాబాద్, మహా:** సంస్థాగత పటిష్టతపై కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి సారించింది. గ్రామస్థాయి నుండి జిల్లా అధ్యక్షుడి వరకు పూర్తిస్థాయిలో నియామకాలు చేసి ఆర్ఎస్ఎస్ తరహాలో పూర్తిస్థాయిలో పార్టీ సైన్యాన్ని పరుగెత్తించాలని భావిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్ గత కొంతకాలంగా అనేక సర్వేలు, క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్, ముఖ్యమంత్రి సారధ్యంలోని కోర్ కమిటీ సూచనలు తీసుకుని డీసీసీలు, పీసీసీ కార్యవర్గంపై నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన నాటినుండీ కార్యవర్గం లేకున్నా, కమిటీలు లేకున్నా వినూత్న కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణ పార్టీని ఒక మోడల్ గా మహేష్ కుమార్ గౌడ్ నిలిపే యత్నం చేశారు. అయితే కార్యకర్తలకు, నాయకులకు పదవుల ద్వారానే జోష్ వస్తుందని భావిస్తున్న హైకమాండ్ స్థానిక ఎన్నికలతో పాటు వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పూర్తిస్థాయి పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైంది. ఏఐసీసీ ఇన్ ఛార్జిగా మీనాక్షి నటరాజన్ వచ్చిన తర్వాత సంస్థాగత ప్రక్రియ ఊపందుకుంది. ఇక డీసీసీలపై కసరత్తు పూర్తయిందని, ప్రతిపాదిత పేర్లు ఇవేనంటూ సోషల్ మీడియాలో జాబితా వైరల్ అయింది. ఆ జాబితా ప్రకారం డీసీసీల పేర్లు ఇలా ఉన్నాయి.

**బలమైన నేతలకే ఛాన్స్**

బలమైన నాయకులను, పార్టీని కాపాడగలిగిన నేతలకే డీసీసీలకు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. వైరల్ జాబితా ప్రకారం ఆదిలాబాద్ నుండి కంది శ్రీనివాసరెడ్డి, నరేష్ జాదవ్, ఆడె గజేందర్ పేర్లను ప్రతిపాదించారు. మంచిర్యాల డిసిసి అధ్యక్షురాలిగా కొక్కిరాల సురేఖను కొనసాగించడనుండగా, నిర్మల్ నుండి కూచాడి శ్రీహరి రావు లేదా నారాయణరావు పాటిల్ కు అవకాశం దక్కనుంది. ఆసిఫాబాద్ జిల్లాకు ప్రస్తుత అధ్యక్షుడు విశ్వప్రసాద్ తో పాటు ఆజ్మీరా శ్యాంనాయక్, దుర్గం భాస్కర్ పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. కరీంనగర్ డిసిసి అధ్యక్షుడిగా ప్రస్తుతం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉండగా, వీరి స్థానంలో ప్రస్తుత గ్రంధాయల సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ లేదా వొడితల ప్రణవ్, రోహిత్ రావులలో ఒకరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. జగిత్యాల డిసిసి అధ్యక్షునిగా కె.సుజిత్ రావు, పెద్దపల్లి డిసిసి అధ్యక్షునిగా రాజ్ ఠాకూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా సంగీతం శ్రీనివాస్, నిజామాబాద్ డిసిసి అధ్యక్షునిగా అరికెల నర్సారెడ్డి, కామారెడ్డి డిసిసి అధ్యక్షునిగా కైలాసం శ్రీనివాసరావు, హన్మకొండ డిసిసి అధ్యక్షునిగా బత్తిని శ్రీనివాస్, ఈవి శ్రీనివాసరావు, పింగిలి వెంకట్రామిరెడ్డి, వరంగల్ డిసిసి అధ్యక్షునిగా నమిండ్ల శ్రీనివాస్, గోపాల నవీన్ రాజు, వెంకట్రామిరెడ్డి, రవళిరెడ్డి పేర్లను ప్రతిపాదించారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షునిగా మరోసారి అయిత ప్రకాష్ రెడ్డిని కొనసాగించనున్నట్లు సమాచారం. జనగామ డిసిసి అధ్యక్షునిగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి లేదా సింగాపురం ఇందిర, మొగుళ్ళ రాజిరెడ్డి, లకావత్ ధన్వంతి, మన్నాన్ పల్లి లింగాజీ, సంగారెడ్డి డిసిసిగా నిర్మలా గౌడ్ లేదా ఉజ్వల్ రెడ్డి లేదా తోపాజీ అనంతకిషన్, మెదక్ డిసిసిగా ఆంజనేయులు గౌడ్ లేదా ఆవుల రాజిరెడ్డి, కె.సుప్రభాత్ రావు, సిద్దిపేట డిసిసి అధ్యక్షునిగా తూంకుంట నర్సిరెడ్డి లేదా బండారు శ్రీకాంత్, చెరుకు శ్రీనివాసరెడ్డి, గంపామహేందర్ తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా హర్షవర్ధన్ రెడ్డితో పాటు కూన శ్రీశైలం గౌడ్, నర్సారెడ్డి భూపతిరెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, సత్యం శ్రీరంగం, రంగారెడ్డి డిసిసి అధ్యక్షునిగా చల్లా నర్సింహారెడ్డితో పాటు దీపా భాస్కర్ రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, భీమ్ భరత్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మహబూబ్ నగర్ డిసిసిగా ఎస్ ఏ వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, శివసేనారెడ్డి, గద్వాల డిసిసిగా సరితా తిరుపతయ్య పేర్లు ప్రతిపాదించినట్లు సమాచారం. నాగర్ కర్నూల్ డిసిసిగా చిక్కుడు వంశీక్రిష్ణ, సూర్యాపేట డిసిసిగా చకిలం రాజేశ్వరరావు, పటేల్ రమేష్ రెడ్డి, యాదాద్రి భువనగిరి డిసిసిగా ప్రమోద్ కుమార్, కె.నగేష్, మహబూబాబాద్ డిసిసిగా వెన్నం శ్రీకాంత్ రెడ్డి, నూనావత్ రాధ, నల్లగొండ డిసిసిగా పున్న కైలాస్ నేత, భద్రాద్రి కొత్తగూడెం డిసిసిగా కొత్త సీతారాములు, ములుగు డిసిసిగా పైడాకుల అశోక్, నారాయణపేట డిసిసిగా కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి, ఖమ్మం డిసిసిగా లోకేష్ యాదవ్, హైదరాబాద్ డిసిసిగా బొల్లుకిషన్, షేక్ అక్బర్, సికింద్రాబాద్ అధ్యక్షునిగా ఆదం సంతోష్, కోట నీలిమ, నూతి శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పి.విజయారెడ్డి, ఎంఆర్జీ వినోద్ రెడ్డి, సునితా ముదిరాజ్, మెట్టుసాయికుమార్ తదితరుల పేర్లు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

**వైరల్ జాబితా కరెక్ట్ కాదు- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

వైరల్ జాబితా కరెక్ట్ కాదని, టీపీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షుల ప్రతిపాదనల పేరుతో సామాజిక మాధ్యమంలో ప్రచారం లో ఉన్న లిస్టులు నిజం కావని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటన విడుదల చేశారు. డీసీసీ లు, టీపీసీసీ కార్యవర్గం ప్రతిపాదనల కోసం క్షేత్ర స్థాయి సంప్రదింపుల కోసం ఒక విధానంతో వెళ్తున్నాం..అలాంటి ప్రతిపాదనలు, లిస్టులు ఇంకా టీపీసీసీ చేయలేదని పేర్కొన్నారు.

# కర్రె గుట్టల్లో.. టెన్షన్ టెన్షన్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా;** తుపాకుల మోతలతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఛత్తీస్ ఘడ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు బలగాలు దండకారణ్యంలో చొచ్చుకుపోతున్నాయి. కర్రెగుట్టలను ఒకేసారి మూడువేల మంది పోలీసులు చుట్టుముట్టడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టు పార్టీ అగ్రనేతలను కేంద్ర బలగాలు హతమార్చాయి. ఊహించని రీతిలో చాలామంది మావోయిస్టులు లొంగుబాట పట్టారు. దీంతో మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమంటూ రెండుసార్లు లేఖలను ప్రభుత్వానికి పంపారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం ములుగు జిల్లా కర్రె గుట్టలపైకి ఎవరూ రావద్దని..గుట్టపై మందుపాతరలను అమర్చామని మరో లేఖను మావోయిస్టులు విడుదల చేశారు.ఇదే క్రమంలో కాల్పులను నిలిపివేయాలని కోరుతూ మరో లేఖను మావోయిస్టులు విడుదల చేశారు. కానీ అడపాదడపా ఛత్తీస్ ఘడ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు, మందుపాతరల సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మళ్లీ మూడు రోజుల నుండి కర్రె గుట్టల అంశం మళ్లీ గుబులు రేబుతోంది.కర్రె గుట్టలను ఒక్కసారిగా భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. మావోయిస్టులు మందుపాతరలను అమర్చాము అని ప్రకటించినప్పటికీ తెలంగాణ, ఛత్తీస్ ఘడ్ భద్రతా బలగాలు కర్రె గుట్టల వైపు దూసుకుపోతున్నాయి. దేశ చరిత్రలోనే అతి పెద్ద ఆపరేషన్ జరిగే అవకాశాలు ఉన్నాయని చర్చ సాగుతోంది. బాంబు స్క్వాడ్ ల సాయంతో నెమ్మదిగా కర్రెగుట్టల రహస్యాన్ని ఛేధించేందుకు బలగాలు ముందుకు సాగుతున్నాయి. హెలికాప్టర్లు,డ్రోన్లు కర్రె గుట్టలను ఒక కంట కనిపెడుతున్నాయి. ఏది ఏమైనా కర్రె గుట్టల్లో దాగివున్న మావోయిస్టులు ఎవరు అనే గుట్టును తేల్చాలని పోలీసులు భావిస్తున్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం లోని తడపాల నిచ్చెన,వీరభద్రారం.. వాజేడు మండలంలోని మురుమూరు అటవీప్రాంతాల్లో నుండి భారీ పేలుళ్ల శబ్దాలు రావడంతో సమీప గ్రామాల్లో భయాందోళన నెలకొంది. ఒకవైపు హెలీకాప్టర్లు,డ్రోన్ల చక్కర్లు కొట్టడంతో పాటు భారీగా భద్రతా బలగాలు కర్రె గుట్టల వైపు కదులుతున్న క్రమంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు

**కర్రె గుట్టల్లో మోస్ట్ వాంటెడ్ హిడ్మా...**

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా కర్రె గుట్టల్లో ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు మూడువేల మంది మావోయిస్టు పార్టీ సభ్యులు కర్రె గుట్టల్లో తలదాచుకున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు కర్రెగుట్టల వైపు కదులుతున్నాయి.మావోయిస్టు పార్టీలో అత్యంత వ్యూహకర్తగా హిడ్మా వ్యవహరిస్తాడనే పేరు ఉంది. భద్రతా బలగాలను సైతం దారిమళ్లించే నేర్పరిగా కూడా పరిగణిస్తారు. అసలు హిడ్మా కర్రె గుట్టల్లో ఉన్నాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# జనతా గ్యారేజ్ లా బీఆర్ఎస్ మారింది

### వరంగల్ సభ చరిత్రలో నిలిచిపోతుంది ఎల్కతుర్తిలో కేటీఆర్

**వరంగల్, మహా:** తెలంగాణ అస్థిత్వాన్ని హిమాలయాల స్థాయికి తీసుకుపోయిన ఘనత కేసీఆర్ ది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా వారంతా గులాబీ జెండా, తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారని బీఆర్ఎస్ ఓ జనతా గ్యారేజీలా మారిందన్నారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఎల్కతుర్తిలో నిర్వహించబోతున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి పార్టీ నేతలతో కలిసి సభాస్థలిని కేటీఆర్ పరిశీలించారు. సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వరంగల్ లో అనేక మహాసభలు నిర్వహించుకున్నామని బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు వరంగల్ మళ్లీ వేధికైందన్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 40 వేల వాహనాలు వచ్చినా పార్కింగ్ కు ఏర్పాట్లు చేస్తున్నామని, పది లక్షల వాటర్ బాటిల్స్, పది లక్షల మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఎటు వైపు నుంచి వచ్చే వాహనాలకు అటు వైపే పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు 100 డాక్టర్స్ టీమ్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

**ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తోంది**

కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ పై నమ్మకం లేదని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదన్నారు. వీళ్లను నమ్ముకుంటే ఏదో రకంగా మోసం చేస్తారని అందుకే సభా నిర్వహణ కోసం 200 జనరేటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ చరిత్రలో ఎల్కతుర్తి సభ అతిపెద్ద బహిరంగ సభ కాబోతున్నదన్నారు. కేసీఆర్ ను చూసేందుకు ఆయన మాట వినేందుకు గ్రామగ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చేందుకు ఎదురు చూస్తున్నారన్నారు.

# రాష్ట్రంలో పంటల భీమా పథకం అమలుకు కసరత్తు

### రైతులందరికి ప్రయోజనం చేకూరేవిధంగా చర్యలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఈ పథకం కింద రైతులందరికి భీమా అందేలా మరియు ఏఏ పంటలకు భీమా పథకాన్ని వర్తింపచేయాలనే విషయాలపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా వానాకాలం మరియు యాసంగి కాలాల్లో ఏఏ పంటలకు ఏఏ విపత్తుల కింద భీమా వర్తింపచేయాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు. నష్టం కలిగే సంభావ్యత ఆధారంగా రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించడం జరిగిందని, సాధారణంగా వానాకాలం సీజన్ లో సుమారు 128 లక్షల ఎకరాలు పంటలు వేయడం జరుగుతుందని, వాటిలో వరి 66.78 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5.23, పత్తి 44.75, మిర్చి 1.90, సోయాబీన్ 3.80, కంది 5.21 లక్షల ఎకరాలు సాగవగా, యాసంగి పంట కాలంలో మొత్తం 78 లక్షల ఎకరాలల్లో పంటలు సాగవగా, వరి 59 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 9, వేరుశనగ 2.2, శనగ 1.7 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం మార్గదర్శకాల ప్రకారంగా వానాకాలానికిగాను మొత్తం ప్రీమియంలో రైతు వాటా 2 శాతం, యాసంగి పంటకాలంలో 1.5 శాతం, వాణిజ్య మరియు ఉద్యానపంటలకు గాను 5 శాతం ప్రీమియం ఉంటుందని, మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం 50:50 భరించడం జరుగుతుందని తెలిపారు. రైతులందరికి పంటలభీమా వర్తింపచేయడం వలన స్థూల పంట విస్తీర్ణంలోని 98 శాతం విస్తీర్ణానికి భీమా వర్తిస్తుందని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వలన ప్రధానంగా అకాల వర్షాల వలనగాని, అధిక వర్షాల వలన గాని, వడగండ్ల వానల వలన, వర్షాభావ పరిస్థితుల వలన గాని కలిగే పంట నష్టానికి పంటల భీమా వల్ల రైతులకు కలిగే నష్టాన్ని కొంతవరకు భర్తీచేసే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిగుబడి ఆధారిత భీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు, మొదలైన పంటలు మరియు వాతావరణ ఆధారిత భీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్ పామ్, టమాట, బత్తాయి మరియు మొదలైన పంటలకు భీమా వర్తింపచేసే విషయంలో పూర్తిస్థాయిలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోని పథకాన్ని రూపకల్పన చేయాలని అధికారులకు సూచించారు. ఎండాకాలంలో వడగళ్ల వర్షం వలన నష్టపోయే వరి మరియు మామిడి వంటి ప్రధాన పంటలకు పూర్తి స్థాయి నష్ట పరిహారాన్ని రైతులకు అందించే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఏ విధంగా అమలుచేస్తున్నాయో అధ్యయనం చేసి, రైతులందరికి ప్రయోజనం చేకూరే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా టెక్నాలజీ ఆధారంగా పంటల దిగుబడి అంచనాలను రూపొందించడం మరియు నష్టపోయిన పంటల విషయంలో భీమా కంపెనీలు సత్వరమే భీమా క్లెయిమ్ అందించుటకు గల విధివిధానాలను రూపొందించాలని సూచించారు. వానాకాలం మరియు యాసంగి పంటలకు సంబంధించి రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా అన్ని రకాల ప్రధాన పంటలకు భీమా ప్రీమియం అంచనా వేయుటకు వెంటనే తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.



# కర్ణాటక సీఎంను, డిప్యూటీ సీఎంను చంపేస్తాం

### సిద్ధూ, డీకేలకు బెదిరింపు మెయిల్స్..!


**మహా :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్ లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్ లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

# ముఖ్యమంత్రి రేవంత్ కు ఘనస్వాగతం

### జపాన్ పర్యటన విజయవంతంగా ముగించుకుని వచ్చిన అధినేత

### శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు


### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు ఎంగేజ్మెంట్ వేడుకకు హాజరు



**హైదరాబాద్, మహా:** జపాన్ పర్యటన విజయవంతంగా ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్ లు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ నెల 16న జపాన్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని అధికారుల బృందం పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరింది. ఏడు రోజుల జపాన్ పర్యటనలో రూ.12062 కోట్ల పెట్టుబడులకు తెలంగాణప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. కాగా ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భారత్ సమ్మిట్ ఏర్పాట్ల పైన మంత్రులు ,ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. రెండురోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా పార్టీ అతిరథ మహారథులంతా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

**జగ్గారెడ్డి కూతురు ఎంగేజ్మెంట్ వేడుకకు**

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు ఎంగేజ్మెంట్ ఫంక్షన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, సిడబ్ల్యూసి సభ్యులు వంశిచంద్ రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బిడ్డను కంటే 5 వేల డాలర్లు!

### జననాల రేటు పెంచేందుకు అమెరికా కొత్త ప్రతిపాదన

**మహా:** దేశంలో ప్రతి ఏటా పడిపోతున్న సంతానోత్పత్తి రేటుపై అమెరికా సర్కారు దృష్టి సారించినట్టు తెలుస్తున్నది. జనాభా పెరిగేలా పలు ప్రోత్సాహకాలు ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. పిల్లల్ని కనే తల్లులకు 5 వేల డాలర్ల (సుమారు రూ.4.25 లక్షలు) బేబీ బోనస్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. దాంతో పాటు చైల్డ్ ట్యాక్స్ క్రెడిట్ (పన్ను మినహాయింపులు) పెంపు, ఫెడరల్ ప్రభుత్వం సాయంతో ఇచ్చే ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం లాంటి వాటిలో పెండ్లి అయిన దంపతులు, పిల్లలున్న వారికి 30 శాతం రిజర్వేషన్ తదితర ప్రతిపాదనలు ఉన్నట్టు సమాచారం. అంతేకాదు, సంతానం సంబంధిత విషయాలపై అమెరికన్ మహిళలకు అవగాహన కల్పించడం లాంటి ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది.

# పీసీసీ పరిశీలకుల నియామకం

- పరిశీలకులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్ లు
- సంస్థాగత ప్రక్రియ మొదలుపెట్టిన మీనాక్షి నటరాజన్
- గ్రామస్థాయి నుండి పార్టీ పటిష్టం.. మహిళలకు మరిన్ని అవకాశాలు
- మే 20వ తేదీలోగా గ్రామ, మండల స్థాయి అభిప్రాయ సేకరణలు పూర్తి.. ఫైనల్ చేయనున్న పీసీసీ
- గుజరాత్ మోడల్ లో డీసీసీల ఎంపిక.. త్వరలో ఏఐసీసీ పరిశీలకులు



**హైదరాబాద్, మహా:** ఏఐసీసీ ఆదేశాల మేరకు సంస్థాగతంగా పార్టీని పటిష్ట పరిచే కార్యక్రమం తెలంగాణలో మొదలైంది. బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరిశీలకుల మీటింగ్‌లో నియమకాన్ని టీపీసీసీ వెల్లడించింది. ఇందులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటుగా సీనియర్లను తెలంగాణలో 35 జిల్లాలకు ఇద్దరు చొప్పున పీసీసీ అబ్జర్వర్లను నియమించింది. ప్రస్తుతానికి మహిళలకు ఇచ్చిన అవకాశంపై తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఇంకా కూడా కొందరికి ఛాన్స్‌బాగుంటుందని ఆమె అభిప్రాయపడినట్లు సమాచారం. పరిశీలకుల్లో ఎమ్మెల్యేలు డా. బి. మురళీ నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్, రవళిరెడ్డి, లకావత్‌ధన్వంతి, బొజ్జ సంధ్యారెడ్డి, తాహెర్ బిన్, మెట్టు సాయికుమార్, శ్రవణ్ కుమార్ రెడ్డి ఉన్నారు. మొత్తంగా ఈ 70 మంది అబ్జర్వర్లు గ్రామస్థాయి నుంచి పర్యటించడంతో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి, అధిష్టానానికి అందజేయనున్నారు.

**పదవుల కోసం అభిప్రాయ సేకరణ**

ఈనెల 25వ తేదీ నుంచి మొదలు మే 20వ తేదీ వరకు ప్రజా క్షేత్రంలో ఉండి గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. మొదట 25 నుంచి 30వ తేదీ మధ్యన జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మీటింగ్‌లో పరిశీలకులు జిల్లాలకు సంబంధించి మండలాలు ఎన్ని, ఇప్పుడు అధ్యక్షులు ఎవరున్నారు. వారి పూర్తి వివరాలు సేకరిస్తారు. ఇంకా పదవులకు సంబంధించిన ప్రపోజల్స్ సేకరిస్తారు. ముఖ్యంగా జిల్లా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు కూడా తీసుకుంటారు. కేవలం నాయకులను కలిసి వారి ఇచ్చిన వివరాలతోనే సరిపుచ్చుకోకుండా అసలు కార్యకర్తల నుంచి సమగ్ర రిపోర్టును తీసుకుంటారు. పదవులకు సంబంధించి కార్యకర్తల మనసులో ఎవరి పేరున్నాదానిపై తెలుసుకోవాల్సిన బాధ్యతను అధిష్టానం అప్పగించింది. ఇలా జిల్లా స్థాయి తరువాత మండల స్థాయిలో సైతం ఇదే రకమైన సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రతి గ్రామం నుంచి ముఖ్యమైన కార్యకర్తల నుంచి గ్రామ, మండల అధ్యక్షులు, మండల కమిటీ, బ్లాక్ కమిటీలపై ప్రపోజల్స్‌చేయనున్నారు. ఒక బ్లాక్‌అయితే మూడు పేర్లు... మండలం అయితే ఐదు పేర్లు, గ్రామానికి మూడు పేర్లు ప్రపోజ్‌చేసి సామాజికవర్గాల వారీగా పీసీసీ అధ్యక్షుల వారికి పంపించాల్సి ఉంటుంది. పీసీసీ కమిటీ కూర్చొని ఎవరెవరిని ఎక్కడా నియమించాలన్నది నిర్ణయం తీసుకుంటారు. ఈ ఎక్సర్ సైజ్ ప్రక్రియ పూర్తయ్యాక డీసీసీ ప్రెసిడెంట్ గా ఎవరున్నారు..దానిపై చర్చించి వీరి నుంచి అభిప్రాయం తీసుకుంటారు. ఈ విషయంలో కూడా రిపోర్టు ఇవ్వనున్నారు. డీసీసీ ప్రెసిడెంట్ నిర్ణయం అంతా కూడా చర్చలోనే ఉన్నది. ఏఐసీసీ నుంచి వచ్చే అబ్జర్వర్లు వచ్చి డీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక నిర్ణయంపై అభిప్రాయాలు తీసుకుంటారు. ఈనెల 25వ తేదీ నుంచి మొదలు మే 20వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తయ్యాక చివరగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కొనసాగనుంది. గుజరాత్‌రాష్ట్రం మాదిరి ప్రతి జిల్లాకు ఒక ఏఐసీసీ అబ్జర్వర్లను పంపనున్నారు. ఏఐసీసీ పాలసీలో భాగంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే విధానం అమలు చేయనున్నారు.



# ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


**ఎల్బీ నగర్,మహా:** పెహల్గాంలో ఉగ్రవాద దాడికి నిరసన,అక్కడ మృతి చెందిన మృతులకి సంతాప సూచకంగా వనస్థలిపురంలో బిజెపి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కోవొత్తుల ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా బిజెపి నాయకులు పెహల్ గమ్ లో ఈ మారణ హోమం సృష్టించిన నరహంతక ముఠాకు ప్రధాని మోఢీ త్వరలోనే బుద్ధి చెవుతారని అన్నారు.ఇంత ఆరాచకానికి పాల్పడిన ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు తడకమల్ల విజయ్, నూతి శ్రీనివాస్,జక్కిడి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాద చర్యలను ఖండించిన అందెల శ్రీరాములు యాదవ్

### బడంగ్ పేట్ కార్పొరేషన్‌లో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేసిన బీజేపీ శ్రేణులు

### హిందువులను టార్గెట్ చేయడంపై ఆగ్రహం

### ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక



**బాలాపూర్ మహా:** జమ్ము కాశ్మీర్ లో పహల్గాం లో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడిని ఖండించిన మహేశ్వరం బీజేపీ నేతలు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని బడంగ్ పేట్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఉగ్రవాదులు కేవలం హిందువులనే టార్గెట్ చేసుకొని కాల్చివేయడం దుర్మార్గమైన చర్య అని మహేశ్వరం కంటెస్టెడ్ ఎమ్మెల్యే,ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గాయాలు పాలైన వారు త్వరగా కోలుకోవాలని,చనిపోయిన వారి ఆత్మ శాంతించాలని ఆ భగవంతుని వేడుకున్నట్టు అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. హిందువులు అంత ఐక్యంగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గం లో రోహింగలు నివసిస్తున్నారని వారిని ఇక్కడి నుండి తరిమి వేయాలని అన్నారు. ఉగ్రవాద ముసుగులో అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదం ఎక్కడ ఉన్న వదిలిపెట్టే ప్రసక్తే లేదని దాడి చేసిన ఉగ్రవాదులకు ప్రాణాలతో బ్రతికే అర్హత లేదని మండిపడ్డారు. సుందరమైన జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో,పర్యాటకుల పై కాల్పులు జరగడం అత్యంత బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సామ సంజీవరెడ్డి , గుర్రం మల్లారెడ్డి,రాజశేఖర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్,రామోజీ అమిత శ్రీశైలం చారి, గౌరా రమాదేవి శ్రీనివాస్,బడంగ్ పేట్ కార్పొరేషన్ క్లస్టర్ 1 రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, క్లస్టర్ 2 అధ్యక్షులు రామిడి వీర కర్ణ రెడ్డి, మాజీ అధ్యక్షులు చేరుకుపల్లి వెంకటరెడ్డి, తుక్కుగూడ మాజీ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన లోకల్ ఎమ్మెల్సీ పోలింగ్

## మొత్తం ఓట్లు 112, పోలింగ్ శాతం 80 శాతం.. పోలింగ్ కు దూరంగా ఉన్న బీఆర్ఎస్

## కట్టుదిట్టమైన ఆంక్షలు, భారీ బందోబస్తు మధ్య పోలింగ్

**మహా:** జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి నేడు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్ లలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారీ బందోబస్తు, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ పోలీసులు కట్టుదిట్టంగా ఆంక్షలను అమలు చేస్తూ పోలింగ్ నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ లో భాగంగా బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, డా. కే. లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లు తొలుత పోలింగ్ బూత్ నెంబర్ 1 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఆ తర్వాత ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దిన్ ఓవైసీ**

ఎమ్మెల్యేలు అక్బరుద్దిన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దీన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలాలు ఒకే సారి వరుసగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రస్తుత లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ లతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి లు తమ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబర్ 2 లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలంగాణ జన సమితి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం కల్లా ఎంఐఎం పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జీహెచ్ఎంసీ పాలక మండలిలో అత్యధికంగా 50 ఓట్ల వరకు ఎంఐఎం పార్టీకి చెందిన ఓట్లు పోల్ కావటంతో మజ్లీస్ పార్టీ అభ్యర్థికి విజయం పట్ల కాన్ఫిడెన్స్ పెరిగింది. ఈ స్థానిక సంస్థ స్థానానికి బీజేపీ అభ్యర్థిని బరిలో నిలిపినపుడు విముఖంగా మాట్లాడిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పోలింగ్ బూత్ నెంబర్ 1లో మధ్యాహ్నం రెండు గంటలకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



**పోలింగ్ సరళి**

ఉదయం పది గంటల కల్లా 37.51 శాతం ఓట్లు నమోదయ్యాయి. మధ్యాహ్నం పన్నెండు గంటల కల్లా సుమారు 77.68 శాతం ఓట్లు నమోదు కాగా, మధ్యాహ్నం రెండు గంటల్లా 78.5 శాతం ఓట్లు పోలైనట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం రెండింటి కల్లా బీఆర్ఎస్ పార్టీ మినహా మిగిలిన కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీకి చెందిన సుమారు 66 మంది కార్పొరేటర్లు, మరో 22 మంది ఆయా పార్టీలకు చెందిన ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటింగ్ కు దూరంగా ఉంటారంటూ ప్రచారం జరిగినా, మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వస్తున్నారంటూ ప్రచారం జరిగింది.

**ఎంఐఎం విజయం లాంఛనమే**

జీహెచ్ఎంసీ లోకల్ బాడీ స్థానం పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ పార్టీకి చెందిన మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి మొత్తం 112 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధికంగా 50 మంది ఓటర్లు ఎంఐఎం పార్టీకి చెందిన వారే ఉండగా, వీరంతా మూకుమ్మడిగా కలిసి రెండు బూత్ లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ స్థానం పరిధిలో పోలైన ఓట్లలో సగానికి పై ఒక ఓటు అదనంగా వచ్చిన అభ్యర్థి విజయం సాధించినట్టేనని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో ఓటింగ్ కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన 24 మంది ఓటర్ల మినహా మిగిలిన 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, అందులో సగం కంటే ఎక్కువ అంటే దాదాపు 50 పై చిలుకు ఓట్లు మజ్లీస్ పార్టీకి అనుకూలంగా ఓటింగ్ చేసిన నేపథ్యంలో ఈ ఎలక్షన్ లో ఎంఐఎం పార్టీ విజయం లాంఛనమేనని తేలిపోయింది. సుమారు 22 ఏళ్ల తర్వాత లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగగా, మిగిలిన సందర్భాల్లో ఈ స్థానం ఎన్నిక ఏకగ్రీవం కాగా, ఈ సారి పోలింగ్, కౌంటింగ్ అనివార్యమైంది.

## మీనాక్షి నటరాజన్ తో సమావేశమైన వరంగల్ ఎంపీ



**వరంగల్, మహా;** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తో సహా పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ ను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల బృందం మల్లు రవి నాయకత్వంలో గాంధీభవన్ లో సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ తో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ కూడా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ని కలసిన వారిలో ఉన్నారు. అనంతరం మీనాక్షి నటరాజన్ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో వరంగల్ జిల్లా పార్టీ వ్యవహారాలపై కాసేపు ముచ్చటించారు.

## జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిపై

# భగ్గుమన్న బీజేవైఎం

## ఉగ్రమూకల దిష్టిబొమ్మ దహనం..

### మతం అడిగి మారణకాండ సృష్టించిన ఉగ్రవాదుల దాడి అత్యంత హేయనీయం

### బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్...

**కరీంనగర్, మహా:** జమ్మూ కాశ్మీర్లో ని పహల్గాం ఉగ్రదాడిపై భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా శాఖ భగ్గుమంది. బుధవారం రోజున కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ ఉగ్ర మూకల దాడిని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో పహల్గాం ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మతం అడిగి మరీ మారణకాండ సృష్టించడం, పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి, ముస్లిం కాదని నిర్ధారించుకొని మరీ కాల్చడం అత్యంత హేయనీయమన్నారు. ఉగ్రముకల దాడి ఇదొక క్రూరమైన, అమానవీయమని , పర్యాటకులను అమాయక పౌరులను, ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని తెలిపారు. ఉగ్రవాదుల చర్యను బీజేవైఎం కరీంనగర్ జిల్లా శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చెప్పారు. దాడి ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయ లేరని పేర్కొన్నారు. ఉగ్రవాదులు చేసిన దాడులకు మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల పట్ల భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అవినాష్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు తోట సాయి,సంపత్,అనిల్,అజయ్,పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పారపల్లి శ్రీనివాస్,నాగసముద్ర ప్రవీణ్,శశికుమార్,జిల్లా కార్యదర్శిలు విజయ్,కుమార్,ఈసంపల్లి మహేశ్,జిల్లా అధికార ప్రతినిధిలు రమేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు సమరసింహారెడ్డి,శివారెడ్డి,సంపత్,జోన్ అధ్యక్షులు పొన్నాల రామ్, వంశీకృష్ణ,సతీష్,వినయ్,కరుణాకర్,ప్రవీణ్,రాజ్,అజయ్,చందు,వినయ్,వెంకటేష్ లు పాల్గొన్నారు.



## పహిల్గాం ఘటన.. మానవత్వంపై దాడి

### కేశంపేట మాజీ జేడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జమ్మూ కాశ్మీర్ లోయలో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి మానవత్వంపై జరిగిన దాడిగా రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ నియోజకవర్గం, కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి పేర్కొన్నారు. పహిల్గాం ఘటనలో ఉగ్రవాదులు అమాయక పర్యటకులను దారుణంగా చంపడం తీవ్రమైన నేరమని విశాల ఆవేదన వ్యక్తం చేశారు. ''ఇది టూరిజానికి, ఎకానమీకి సంబంధించిన వ్యవహారం కాదు, మానవత్వానికి మచ్చ అని ఖండించారు. అందరూ సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం'' అని ఆమె అన్నారు. టూర్జిస్టుల తప్పేమిటి? ఇక్కడ పర్యటించడానికి వచ్చారు. పర్యాటకులు, వారి కుటుంబాలకు తాము సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు 30 మంది వరకు మృత్యువాత పడ్డారని మరి ఎంతోమంది తీవ్రంగా గాయపడ్డారని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన చెందారు. ఉగ్రదాడులకు ప్రతిగా ఆర్మీ తీసుకునే చర్యలకు తామంతా అండగా నిలుస్తామని తెలిపారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని, అవసరమైతే తామంతా ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఆర్మీకి బాసటగా నిలుస్తామని, మానవతావాదానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ దుఃఖం మరియు ఆగ్రహ సమయంలో ఉగ్రవాదుల స్థానం ఎక్కడ ఉందో చూపించడానికి ప్రపంచం మొత్తం కలిసి రావాలని ప్రతి ఒక్కరూ కలిసి వచ్చి ఇటువంటి ఉగ్రవాదం ప్రపంచంలో ఎక్కడైనా ఉంటే దానిని తుంచి వేయాలని ఈ అవమానియా ప్రవర్తన ద్వారా అమాయక ప్రజల జీవితాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బాధితుల కుటుంబాలకు ఆత్మస్థైర్యం కోసం అందరూ ప్రార్థించాలని విశాల శ్రావణ్ రెడ్డి కోరారు.

## హిందువులనే లక్ష్యంగా కాల్చి చంపిన ఉగ్రవాదులు

### ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ పార్టీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి

### విషాదకర సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గామ్ లోని బైసారన్ లోయను సందర్శించడానికి వచ్చిన పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 30 మందికి పైగా పర్యాటకులు మృతి చెందడం పట్ల బిజెపి పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమనగల్ మున్సిపాలిటీలో అటల్ బిహారి వాజ్పేయి చౌరస్తాలో, ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే ఈ ఉగ్రమూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ ఉగ్రదాడిలో హిందువులని గుర్తించి మరి చంపి పైశాచిక ఆనందాన్ని ఉగ్రవాదులు పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి క్రూర చర్యలు మానవత్వానికి మచ్చలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అవిశ్వాసాన్ని, అసహనాన్ని వ్యాప్తి చేసే ఈ విధమైన ఉగ్రవాద దాడులను తూర్పరిచే సమయం ఆసన్నమైందని ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నాయకత్వంలో ఉగ్రవాదుల ఎరివేతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగాన్ని అప్రమత్తం చేసి పర్యాటక ప్రాంతాలలో మరియు రద్దీగా ఉన్న ప్రాంతాలలో అదనపు బలగాలతో నిఘా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆమనగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్ మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, ఆమనగల్ మండలం బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆమనగల్ మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు నాగిళ్ల సందీప్, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.





## యువత స్వయం ఉపాధి ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఆరుట్లలో జీవన్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా మహా:** యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆరుట్ల గ్రామానికి చెందిన పంబాల జీవన్ ఏర్పాటు చేసిన జీవన్ డయాగ్నోస్టిక్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెవిఆర్ మాట్లాడుతూ.... యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడవాలని, సమయాన్ని వృధా చేయకుండా సరైన మార్గాన్ని ఎంచుకొని ఆ రంగంలో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మార సురేష్, పంబాల బుగ్గరాములు, బుట్టి కృష్ణ, యూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు దాసరమోని అశోక్, పంబాల శివ లక్ష్మనాయక్, పాండాల శ్రీనివాస్, భాస్కర్, రైనా, రావుల నాగరాజు, బుడిగల పరమేష్, పంబాల కిషోర్, ఎండి అశ్రఫ్, రాజు, శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పిల్లలు పాఠశాలలో చేరేలా ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మహా:** వలస కార్మికుల పిల్లలను చదువుకు దగ్గర చేసి వచ్చే విద్యా సంవత్సరం వారి వారి ప్రాంతాల్లో పాఠశాలల్లో చేరే విధంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. కార్మికుల పిల్లలతో హిందీ, ఒడియా భాషల్లో ముచ్చటించారు. పిల్లలకి ఇస్తున్న ఆహారం, బోధన విధానాన్ని గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలస కార్మికుల పిల్లలు కార్మికులుగా మారకూడదని ఉద్దేశంతోనే జిల్లాలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశామని అన్నారు. వారిని చదువుకు దగ్గర చేయడం ద్వారా వారి ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లే అవకాశం ఉందని అన్నారు. వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నామని తెలిపారు. పిల్లలందరికీ ఇదివరకే వైద్య పరీక్షలు చేయించామని, అనుబంధ ఆహారం అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నవీన్ కుమార్, మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు జి వీరేశం, శ్రీలత పాల్గొన్నారు.





## ఆక్రమణదారులపై చర్యలు


### మున్సిపల్ కమీషనర్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఎలాంటి ఆక్రమణలు జరిగినా చర్యలు చేపడతామని మున్సిపల్ కమీషనర్ కెవిఎన్ రాజు తెలిపారు.పట్టణ నడిబొడ్డున గల ఎన్టీఆర్ చౌక్ సమీపంలోని చర్చ్ పక్కన మున్సిపల్ స్థలంలో అక్రమంగా నిర్మించిన రెండు దుకాణాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. వాటినివెంటనే తొలగించాలని సదరు వ్యక్తికి నోటీసులు కూడా పంపినట్టు వివరించారు. ప్రస్తుతం అది రిమూవల్ ప్రాసెస్ లో ఉందన్నారు. రెండు మూడు రోజుల్లో తొలగిస్తామని తెలిపారు.

## పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ను ప్రారంభించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో పోలీస్ సబ్ కంట్రోల్ రూం ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. బస్టాండ్ తో పాటు పరిసర ప్రాంతాలలో ఎలాంటి నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దీనిని ప్రారంభించడం జరిగిందన్నారు. ఏఎస్ఐ ముకుందరావు కు సబ్ కంట్రోల్ రూమ్ బాధ్యతలను అప్పగించారు. చిన్న చిన్న దొంగతనాలు, పిక్ పాకెట్స్, ఈవ్ టీజింగ్, రోడ్డు ప్రమాదాలు సమయంలో తక్షణ సహాయం అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్యలకైనా క్షణాల వ్యవధిలో స్పందించే విధంగా ఉదయం నుండి రాత్రి వరకు ప్రజలకు సేవలందిస్తారని తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ సభ



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాధిక అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేశ్ రచించిన భారత దేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానం మరియు సవాళ్లు అనే అర్థశాస్త్ర పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ... దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అంశాన్ని డాక్టర్ రమేశ్ అందరికీ అర్థమయ్యే రీతిలో భారత దేశ ఆర్థిక అభివృద్ధి పాలసీ విధానాన్ని మరియు సవాళ్లను ఎంతో పరిశోధనాత్మకంగా రచించాడని కొనియాడారు. అంతేగాకుండా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ అనేక పాఠ్యాంశాలను ఓపెన్ ఇంటర్ కు, ఎం.ఏ. ఎకనామిక్స్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి పాఠ్యాంశాలను రచించి విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడినాడని, పుస్తకరచన పట్ల అతనికున్న మక్కువకు ఈ పుస్తకాలే నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు రచించి ఎందరో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ చింతల రాకేశ్ భవాని వ్యవహరించగా , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే సురేష్, అధ్యాపకులు డి.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ, నరేందర్ రెడ్డి, డాక్టర్ మాధవి, రవికుమార్, డాక్టర్ డి.వి. రావు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### కాయితీ విజయ్ కుమార్ రెడ్డి కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు

### కల్వకుర్తిలో గడపగడపకు రాజ్యాంగ పరిరక్షణ కరపత్రాలు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఏఐసీసీ పీసీసీ, పిలుపు మేరకు మరియు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని యంగంపల్లి గ్రామంలో అంబేద్కర్ రాజ్యాంగ పరిరక్షణ, గాంధీ శాంతి సందేశం గడప గడపకు వెళ్ళి వివరించే పాదయాత్ర చేపట్టారు. మండల నాయకులు గ్రామంలోని కార్యకర్తలతో కలిసి డాక్టర్ బాబ సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి పూల మాల వేసి, గ్రామంలో ప్రతి గడప గడపకు వెళ్ళి కరపత్రాలు పంచుతూ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఏవిధంగా అణిచి వేస్తుందో వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా జరగని బీసీ కుల గణన, అలాగే ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మన కాంగ్రెస్ ప్రభుత్వానికె దక్కిందన్నారు. ఎన్నికల లో చెప్పిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గడప గడపకు తిరిగి చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షులు బీస బాల్ రాజు, నాని యాదవ్, బండి సుదర్శన్, జంగయ్య, శ్రీధర్ రెడ్డి, యంగంపల్లి గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యం, సీనియర్ నాయకులు తిరుపత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మావిళ్ళ పల్లి వంశీ,కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, చంద్రయ్యా, భీమయ్య,వెంకయ్య, రవి, బాలస్వామి, జహంగీర్, రామస్వామి,సత్యం, అమీర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ యువకుడికి బర్త్ సర్టిఫికెట్

## నార్సింగి మున్సిపాలిటీ నుంచి జారీ

### దీని ఆధారంగా పాస్ పోర్ట్ కు దరఖాస్తు.. విచారణలో వెలుగు చూసిన వ్యవహారం

### సిటీ టాస్క్ పోర్స్ అదుపులో ఔట్సోర్సింగ్ ఉద్యోగి సుధీర్

### బంగ్లాదేశీయుని అదుపులోకి తీసుకున్న పోలీసులు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన ఓ యువకుడికి, నార్సింగి మున్సిపాలిటీ నుంచి జనన దృవపత్రం మున్సిపాలిటీ అధికారులు జారీ చేయడం జరిగింది. దీని ఆధారంగా అతడు పాస్ పోర్టు కోసమని పాస్పోర్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ యొక్క దరఖాస్తు వెరిఫికేషన్ కోసమని అధికారులు సదరు వ్యక్తి నివసిస్తున్న ప్రాంతానికి వెళ్లి, విచారించిన నేపథ్యంలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సదరు వ్యక్తికి నకిలీ జనన ధ్రువపత్రం తెలుగులోకి రావడంతో సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. నార్సింగి మున్సిపాలిటీలో పని చేస్తున్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు సదరు బంగ్లాదేశ్ యుడినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో ఆరా తీస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**వివరాలు ఇలా ఉన్నాయి..**

నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో సుధీర్ అనే వ్యక్తి ఆరేళ్లుగా ఔట్సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నాడు. దీనికి ముందు అతడు జీహెచ్ఎంసీ కార్యాలయంలో పని పనిచేసినట్లు తెలిపారు. అధికారులు ఇతడికి జనన, మరణ ధ్రువీకరణ జారీ చేసే బాధ్యతలను అప్పగించారు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న సుధీర్.. బంగ్లాదేశీయుడు నార్సింగిలో జన్మించిన వ్యక్తిగా జనన ధ్రువీకరణ పత్రం జారీ చేశాడని తెలిపారు. దాదాపు రెండేళ్ల క్రితం ఈ పత్రం తీసుకున్న బంగ్లాదేశ్ యువకుడు ఇటీవల పాస్పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జరిగిన పోలీసు వెరిఫికేషన్లో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు సుధీర్ తో పాటు తనతో పాటు విధులు నిర్వహిస్తున్న మరికొందరు వ్యక్తులను మరింత లోతుగా విచారణ చేపట్టగా మున్సిపల్ కార్యాలయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న సుధీర్ రెండు సంవత్సరాల క్రితం ఒకరికి అప్పటి కమిషనర్ సత్యబాబు డిజిటల్ సంతకంతో జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్టు తెలిసింది. అది నకిలీదని, దానిపై విచారణ చేస్తున్నామని, అతన్ని అదుపులోకి తీసుకుంటు న్నామని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. అతను చేసిన అక్రమాలన్నింటినీ వెలుగులోకి తీసుకువస్తామని తెలిపారు.

# ప్యూర్‌పవర్ గ్రిడ్‌ను ఆవిష్కరించిన ప్యూర్

## ఇంధన పరివర్తనలో భారతదేశ కృషికి తోడ్పడనున్న 5 MWh పవర్‌హౌస్





**ఢిల్లీ:** విద్యుత్ స్టోరేజీ ఉత్పత్తుల విభాగంలో అగ్రగామి, టూవీలర్ ఈమొబిలిటీ రంగంలో దిగ్గజమైన ప్యూర్ సంస్థ, బ్యాటరీ ఆధారిత 5 MWh గ్రిడ్ స్టోరేజీ ఉత్పత్తి ప్యూర్‌పవర్ గ్రిడ్‌ను ఢిల్లీలో ఆవిష్కరించింది. ఈ వినూత్నమైన ఉత్పత్తి, భారతదేశ విద్యుత్ మౌలిక సదుపాయాల్లో పరివర్తన తెచ్చేందుకు, గ్రిడ్ స్థిరత్వంపరంగా సాధికారత కల్పించేందుకు, రెన్యూవబుల్ ఎనర్జీ వనరులను సమగ్రపర్చడాన్ని వేగవంతం చేసేందుకు తోడ్పడనుంది. ఇన్‌బిల్ట్ సోలార్, పీసీఎస్‌తో 5MWh కంటైనరైజ్డ్ ఉత్పత్తిగా రూపొందిన ప్యూర్‌పవర్ గ్రిడ్ ఇప్పటికే పరిశ్రమలో గణనీయంగా ఆమోదయోగ్యత పొందింది. 10కి పైగా దిగ్గజ రెన్యూవబుల్ ఎనర్జీ ఈపీసీ సంస్థలు & భారీ పరిశ్రమల నుంచి ప్యూర్‌కి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఈవోఐ) వచ్చాయి. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంలకు (బీఈఎస్ఎస్) భారత్‌లో డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. 2030 నాటికి దేశం నిర్దేశించుకున్న 500 GW పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యం, 200 GWh పైగా బీఈఎస్ఎస్ సామర్థ్యాల అవసరం నెలకొన్న నేపథ్యంలో ఈ దశాబ్దం ఆఖరు నాటికి ఈ మార్కెట్ 36 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. అధునాతన టెక్నాలజీతో దశాబ్దకాలంపైగా డిజైన్ సామర్థ్యాలు, మేకిన్ ఇండియా అనుభవం దన్నుతో గ్రిడ్‌స్కేల్ సెగ్మెంట్లో ప్యూర్ చాలా తక్కువ ధరలో, అధునాతన ఉత్పత్తిని అందించగలుగుతోంది. ప్యూర్‌పవర్ గ్రిడ్ అత్యధిక విద్యుత్ సాంద్రత గల బ్యాటరీలు, 5వ తరం పవర్ ఎలక్ట్రానిక్స్‌తో నిర్మించబడింది. నిరాటంకమైన రిమోట్ మానిటరింగ్, 100 శాతం అప్‌టైమ్, తక్కువ అవాంతరాలు, గరిష్ట నిర్వహణ సామర్థ్యాల కోసం ఇందులో క్లౌడ్ & ప్రెడిక్టివ్ ఏఐ పొందుపర్చబడింది.

ప్యూర్‌పవర్‌లో సెల్‌స్థాయిలో నానోపీసీఎం కూలింగ్, ప్యాక్‌స్థాయి మరియు ర్యాక్‌స్థాయిలో లిక్విడ్ కూలింగ్ సామర్థ్యాలతో గ్రిడ్ సమగ్రమైన మల్టీలెవెల్ థర్మల్ మేనేజ్‌మెంట్/కూలింగ్ సిస్టం కలిగి ఉంటుంది. శక్తి వృధా కాకుండా వేడిమి సక్రమంగా విస్తరించేందుకు, జీవితకాలం పెరిగేందుకు, మెరుగైన రౌండ్ ట్రిప్ సామర్థ్యాలకు విశిష్టమైన ఈ డిజైన్ ఉపకరిస్తుంది. ప్రపంచ స్థాయి భద్రతను అందిస్తుంది. పోటీ సంస్థలతో పోలిస్తే మెరుగైన ధరకు అందిస్తుండటం, స్థానికంగానే విడిభాగాలతో సర్వీసింగ్ సదుపాయం అందుబాటులో ఉండటం వల్ల భాగస్వాములకు మెరుగైన, సమర్ధవంతమైన అసెట్ మేనేజ్‌మెంట్ సేవలు పొందేందుకు వీలవుతుంది. "ప్యూర్‌పవర్ గ్రిడ్ అనేది ఒక ఉత్పత్తి మాత్రమే కాదు. భారత ఇంధన పరివర్తనకు ఇదొక ఉత్ప్రేరకంలాంటిది. బ్యాటరీ టెక్నాలజీ, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో అపార అనుభవంతో శక్తివంతమైన, తెలివైన, తక్కువ ధరకు లభించే గ్రిడ్‌స్కేల్ ఉత్పత్తిని మేము రూపొందించాం. గ్రిడ్ స్థిరత్వానికి, రెన్యువబుల్స్‌ను నిరాటంకంగా సమగ్రపర్చడానికి ప్యూర్‌పవర్ గ్రిడ్ తోడ్పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ అప్‌గ్రేడ్, రైట్ ఆఫ్ వే, డిస్ట్రిబ్యూషన్ అప్‌గ్రేడేషన్ వంటి వ్యయప్రయాలతో కూడుకున్న ప్రక్రియల భారం లేకుండా ఈఎస్ఎస్ ప్రోడక్టులను సమగ్రపర్చడం ద్వారా ఈవీలకు ఫాస్ట్ చార్జర్ల వినియోగాన్ని పెంపొందించేందుకు కూడా ప్యూర్‌పవర్ గ్రిడ్ తోడ్పడుతుంది" అని Dr. నిశాంత్ దొంగారి తెలిపారు. ప్యూర్ ఇప్పటికే గృహాలు, వ్యాపార సంస్థలకు తమ ప్యూర్‌పవర్ హోమ్, ప్యూర్‌పవర్ కమర్షియల్ ప్రోడక్టుల ద్వారా సేవలు అందిస్తుండగా, ఢిల్లీలో ఆవిష్కృతమైన 5 MWh ప్యూర్‌పవర్ గ్రిడ్, సౌర & పవన విద్యుత్ ప్రాజెక్టులు, భారీ కమర్షియల్ మరియు పారిశ్రామిక సంస్థలతో పాటు జాతీయ రహదారులపై ఏర్పాటు కాబోయే వేలకొద్దీ ఈవీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లకు దన్నుగా నిలవగలదు.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

బుధవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 406.40 పాయింట్లు లేదా 0.51 శాతం లాభంతో 80,001.99 వద్ద, నిఫ్టీ 115.10 పాయింట్లు లేదా 0.48 శాతం లాభంతో 24,282.35 వద్ద నిలిచాయి. మైండ్‌టెక్ (ఇండియా), వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్, సిగ్మా సాల్వ్, ఆప్టెక్, మోదీ రబ్బర్ వంటి కంపెనీలు లాభాల జాబితాలో చేరాయి. వీడోల్ కార్పొరేషన్, జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్, ఉమా ఎక్స్‌పోర్ట్స్, రవి కుమార్ డిస్టిలరీస్, Xelpmoc డిజైన్ అండ్ టెక్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.



# వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం

## విధివిధానాలు అధికారికంగా ఖరారు

### ప్రధాని మోదీ అప్రూవల్ రేటింగ్స్ చూస్తే నాకు అసూయగా ఉంది

### అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్



**జైపూర్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరుగుతోందని, ఆయనను చూస్తే అసూయగా ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని కొందరు విమర్శిస్తున్నప్పటికీ ఆయన పేరు ప్రతిష్టలు మరింత ఇనుమడిస్తున్నాయే తప్ప ఎక్కడా తగ్గడం లేదన్నారు. అంతర్జాతీయంగా మోదీకి లభిస్తున్న అప్రూవల్ రేటింగ్స్ తనకు అసూయ కలిగిస్తున్నాయని, ఈ విషయం సోమవారం నేరుగా మోదీకే చెప్పానని వెల్లడించారు. 'మోదీ స్పెషల్ పర్సన్' అని ప్రశంసించారు. మంగళవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓ సదస్సులో వాన్స్ ప్రసంగించారు. ప్రధానంగా ఇండియా-అమెరికా సంబంధాలపై మాట్లాడారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం విషయంలో తుది ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధమైందని ప్రకటించారు. రోడ్‌మ్యాప్‌పై విధివిధానాలను ఇరు దేశాలు అధికారికంగా ఖరారు చేశాయని వెల్లడించారు. భారతదేశ ఉత్పత్తులపై విధించిన 26 శాతం ప్రతీకార సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 90 రోజులపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం కావడం డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల విజన్ వాస్తవరూపం దాల్చే విషయంలో ఒక కీలకమైన ముందడుగు అని వాన్స్ అభివర్ణించారు. భారత్-అమెరికా సంయుక్తంగా ప్రగతి సాధించాలని ట్రంప్ కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ 'కొరుకుడుపడని కఠినమైన సంధానకర్త' అని అభివర్ణించారు. ఆయనతో బేరం తేల్చడం అంత సులభం కాదన్నారు. అందుకే ఆమెరికా ఆయనను గౌరవిస్తోందని వ్యాఖ్యానించారు.

**మిత్రుడిగా వచ్చా..**

తాను ఇండియాకు నీతిబోధలు చేయడానికి రాలేదని, ఒక భాగస్వామిగా, మిత్రుడిగానే వచ్చానని జె.డి.వాన్స్ అన్నారు. ఏ పని ఎలా చేయాలో ఇండియాకు నేర్పే ఉద్దేశం తనకు లేదన్నారు. గతంలో అమెరికా ప్రభుత్వాలు భారత్‌కు నీతి పాఠాలు బోధించేందుకు ప్రయత్నించేవని, భారత్‌ను చౌకగా కార్మిక శక్తి లభించే దేశంగానే చూసేవారని చెప్పారు . ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని పేర్కొన్నారు. అమెరికా ఉత్పత్తులను మరింత అధికంగా కొనుగోలు చేయాలని భారత్‌కు విజ్ఞప్తిచేశారు. అమెరికా ఇంధన, రక్షణ ఉత్పత్తులు, పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేయాలన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. టెక్నాలజీ, రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి వేర్వేరు కీలక రంగాల్లో భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం'పై ఇరుదేశాలు చర్చలు కొనసాగిస్తున్నాయని తెలిపారు.

### ఇవాన్ ఇండియాలోనే ఉంటానన్నాడు

ప్రధాని మోదీ తమకు చక్కటి ఆతిథ్యం ఇచ్చారని జె.డి.వాన్స్ ఆనందం వ్యక్తంచేశారు. మోదీ ప్రేమానురాగాలు తమ కుటుంబాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా తమ ముగ్గురు పిల్లలకు మోదీ ఎంతో ఆత్మీయులయ్యారని తెలిపారు. మోదీ ఇచ్చిన విందు తన కుమారుడు ఇవాన్‌కు ఎంతోగానో నచ్చిందని, ఇండియాలోనే ఉండిపోవాలని కోరుకుంటున్నట్లు ఇవాన్ తనతో చెప్పాడని అన్నారు. తన పిల్లలకు డొనాల్డ్ ట్రంప్‌తో ఏర్పడిన అనుబంధం ఇప్పుడు మోదీతోనూ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఇండియాలో తన కంటే తన భార్య ఉషా చిలుకూరికే గొప్ప ఆదరణ లభిస్తోందని వాన్స్ చమత్కరించారు.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL



# శనివారం పోప్ అంత్యక్రియలు

## పార్థివదేహాన్ని దర్శించుకునేందుకు బుధవారం నుంచి అనుమతి

## పోప్ కోరిక మేరకు నిరాడంబరంగా సాగనున్న అంత్యక్రియలు



తొలిసారిగా పార్థివదేహం ఫొటో విడుదల

**వాటికన్ సిటీ:** వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో మూడు రోజులపాటు ప్రజల సందర్శనలు, నివాళుల తర్వాత శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలను నిర్వహించనున్నారు. కోట్లాది మంది క్యాథలిక్‌ల అత్యున్నత మతాధికారి అయినప్పటికీ అత్యంత సాధారణ వ్యక్తిలా ఖనన క్రతువును పూర్తిచేయాలని పోప్ కోరుకున్నారని, అదేరీతిలో అంత్యక్రియలను పూర్తిచేస్తామని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ మరణంతో ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తుతున్న వేళ పోప్ అంత్యక్రియల షెడ్యూల్ వివరాలను వాటికన్ అధికార వర్గాలు మంగళవారం వెల్లడించాయి. సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద శనివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియల కార్యక్రమాన్ని మొదల పెట్టనున్నారు. కార్డినళ్ల కాలేజీ డీన్ అయిన 91 ఏళ్ల కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు, అర్జెంటీనా అధ్యక్షుడు జేవి యర్ మిలేయా తదిత రులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా కోమాలోకి వెళ్లి, తర్వాత గుండె వైఫల్యం కారణంగా కన్నుమూసిన విషయం విదితమే.

అధికారిక నివాసంలోకాకుండా పోప్ పార్థివదేహాన్ని పోప్‌గా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆయన నివసిస్తున్న డోమస్ శాంటా మార్టా గెస్ట్‌హౌస్ హోటల్ చాపెల్‌లోనే ఉంచారు. వాటికన్ విదేశాంగ మంత్రి కార్డినల్ పెట్రో పరోలిన్ పోప్‌కు నివాళులర్పిస్తున్న ఫొటోలను అధికారికంగా మంగళవారం విడుదలచేశారు. ఎర్రని వస్త్రంతో కప్పిన కలపతో చేసిన శవపేటికలో పోప్ పార్థివదేహాన్ని ఉంచారు. పోప్ నచ్చిన శ్వేత వర్ణ 'మిటర్' టోపీని ఆయనకు పెట్టారు.

**సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో ఖననం**

ఆయన ఎక్కువగా సందర్శించి, ప్రార్థించే సెయింట్ మేరీ మేజర్ బాసిలికా చర్చి ప్రాంగణంలోనే పోప్‌ను ఖననం చేయనున్నారు. అక్కడే తనను ఖననం చేయాలని పోప్ గతంలోనే సూచించారు. ఆ మేరకే ఖనన క్రతువును పూర్తిచేయనున్నారు.


# మమ్మల్ని నిందించకండి.. పహల్గాం దాడిపై స్పందించిన పాక్



**న్యూఢిల్లీ:** జమ్ము కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిపై పొరుగు దేశం పాకిస్థాన్ స్పందించింది. ఉగ్రదాడిలో పర్యాటకుల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేసింది. అయితే దాడుల వెనుక తమ ప్రమేయం ఉందన్న వాదనను ఖండిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అనంతనాగ్ జిల్లాలో జరిగిన దాడిలో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈ ఘటనపై మేం ఆందోళన చెందుతున్నాం. మృతుల కుటుంబాలకు మా సంతాపం తెలియజేస్తున్నాము. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము అని పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే అంతకు ముందు.. పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ పహల్గాం దాడిపై స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తామూ వ్యతిరేకిస్తామని ప్రకటించారు. భారత్‌లో జమ్ము కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్ సహా దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల్లో తిరుగుబాట్లు నడుస్తున్నాయని.. బహుశా ఈ క్రమంలోనే పహల్గాం దాడి జరిగి ఉంటుందని, ఇందులో విదేశీ శక్తుల దాడి అయ్యి ఉండకపోవచ్చని ఓ స్థానిక న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. ప్రాథమిక హక్కులను కోల్పోయిన వ్యక్తులపై సైన్యం లేదంటే పోలీసులు దారుణాలకు పాల్పడుతుంటే.. పాకిస్తాన్‌ను నిందించడం అలవాటుగా మారిపోయింది. పహల్గాం దాడిలో.. మమ్మల్ని నిందించకండి'' అంటూ ఖ్వాజా అసిఫ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై భారత్ స్పందించాల్సి ఉంది. పహల్గాంలోని బైసరన్‌లో ఉగ్రదాడి చేసి పర్యాటకులను పొట్టనబెట్టుకున్న 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF)' .. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఏర్పడిందే. తొలుత టీఆర్ఎఫ్ ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు నడిపించింది. ఆపై లష్కరే తోయిబా (LeT) వంటి పలు ఉగ్ర సంస్థ సభ్యులను తీసుకుని ఫిజికల్ గ్రూపుగా ఏర్పాటైంది. 2019లో ఏర్పాటైనప్పటి నుంచి టీఆర్ఎఫ్ దాడులకు దిగుతూ.. కశ్మీర్ ప్రాంతంలో ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. దీంతో 2023లో టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థల జాబితాలో భారత్ చేర్చింది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐనే టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని భారత నిఘా వర్గాల సమాచారం. లష్కరే తోయిబా నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించడానికి ఈ టీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయించినట్లు చెబుతుంటారు.

# విశ్వసనీయ మిత్రదేశం

## సౌదీ అరేబియాపై మోదీ ప్రశంసలు




**జెడ్డా:** ''భారత్-సౌదీ అరేబియా స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలి. అందుకు నా పర్యటన దోహదపడుతుంది'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం సౌదీలో పర్యటించారు. మోదీ విమానం సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఆరు ఎఫ్-15 ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా నిలవడం విశేషం. సంబంధిత వీడియోను భారత విదేశాంగ శాఖ విడుదల చేసింది. మోదీకి లభించిన అపూర్వ ఆహ్వానం భారత్-సౌదీ అరేబియా మధ్య బలపడుతున్న రక్షణ సహకారానికి ప్రతీక అని పేర్కొంది. ఎయిర్‌పోర్టు నుంచి బస చేసే హోటల్‌కు చేరుకున్న మోదీకి సంప్రదాయ స్వాగతం లభించింది. సౌదీ గాయకుడు హాషీం అబ్బాస్ 'ఆయే వతన్ మేరే ఆబాద్ రాహే తూ' హిందీ పాటను చక్కగా ఆలపించారు. మోదీ చప్పట్లతో ఆ గాయకుడిని అభినందించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రవాస భారతీయులతో ఆప్యాయంగా మాట్లాడారు.

**సౌదీ యువరాజు నా సహోదరుడు**

భారత్‌కు సౌదీ అత్యంత విలువైన, విశ్వసనీయమైన మిత్రదేశమని మోదీ ఉద్ఘాటించారు. ఆయన మంగళవారం 'అరబ్ న్యూస్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆసియాలో శాంతి, స్థిరత్వాన్ని రెండు దేశాలు ప్రగాఢంగా కోరుకుంటున్నాయని మోదీ తెలిపారు.

# యువ ప్రేమజంట ఆత్మహత్య!



**బళ్లారి:** ప్రేమ జంట ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. వారం రోజుల క్రితం కనిపించకుండా పోయిన ప్రేమికులు శవాలై తేలారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హరపనహళ్లి తాలూకా బిట్టినకట్టి గ్రామానికి చెందిన మద్దనస్వామి (18), బండ్రి గ్రామానికి చెందిన దీపిక (18) అనే ఇద్దరు ప్రేమించుకున్నారు. పీయూసీలో ఇద్దరు ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. అయితే వారం రోజుల క్రితం ఏమైందో కాని ఇరువురు కనబడకుండా వెళ్లిపోయారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో కూడా తల్లి దండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తున్న నేపథ్యంలో హరపనహళ్లి పట్టణ శివారులోని ఐటీఐ కళాశాల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరి వేసుకున్న స్థితిలో శవాలై తేలారు. స్థానిక పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అక్కడి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. గ్రామంలో తీవ్ర విషాదం అలముకొంది.



# ఉరి, పుల్వామా కంటే ఘోరమైన దాడి ఇది

## అసదుద్దీన్ ఒవైసీ

**న్యూఢిల్లీ:** ఉరి, పుల్వామాలలో జరిగిన దాడుల కంటే.. జమ్ము కశ్మీర్ పహల్గాం)లో తాజాగా జరిగిన ఉగ్ర దాడి అత్యంత ఘోరమైందని, అది తనను ఎంతగానో బాధించిందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. నిఘా వ్యవస్థ వైఫల్యం వల్లే దాడి జరిగిందన్న ఆయన.. ఘటనకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ''పహల్గాంలో.. మతం ఏంటని అడిగిన తర్వాతే ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. ఇది గతంలో జరిగిన ఉరి, పుల్వామా ఉగ్రదాడుల కంటే ఘోరమైంది. ఈ దాడిని మేం ఖండిస్తున్నాం. ఇది కచ్చితంగా నిఘా వ్యవస్థ వైఫల్యమే. జమ్ములో ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరోధక విధానం పనిచేస్తుందో లేదో పరిశీలించుకోవాలి. ఈ ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పి.. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తుందని ఆశిస్తున్నాం'' అని విలేకరులతో అన్నారాయన. దక్షిణ జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ లోయలో ఘోరం జరిగింది. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. మైదానంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్న పర్యాటకులను చుట్టుముట్టి తుపాకులతో దారుణంగా కాల్చి చంపారు. ఐడీ కార్డులను పరిశీలించి.. పేరు, మతం ఆధారంగా వేరు చేసి మరీ దాడి చేశారు. ఈ దాడిలో 26 మంది అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడి మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాళ్లలో ఇద్దరు తాజాగా మరణించడంతో మృతుల సంఖ్య 28కి చేరింది. అయితే.. బాడీ కేమ్ ద్వారా దాడి దృశ్యాలను పాక్‌లోని తమ హ్యాండర్లకు ఉగ్రవాదులు చేరవేసినట్లు భద్రతా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే ఉగ్రవాదుల ఫొటోలు, ఊహా చిత్రాలు విడుదల చేసి.. జమ్ము వ్యాప్తంగా గాలింపు కొనసాగిస్తోంది.

## నన్ను అలా ఎవరైనా పిలుస్తే.. చాలా ఇష్టం: తమన్నా



హీరోయిన్‌గా తమన్నా రెండు దశాబ్దాలుగా రాణిస్తుంది. హిందీ, తెలుగు, తమిళం తదితర భాషల్లో పలు చిత్రాలు చేసి అగ్ర కథానాయకిగా మెప్పిస్తుంది. మధ్య మధ్యలో ప్రత్యేక పాటల్లో నటిస్తున్నా అవి ఆమె కెరీర్‌కు ప్లస్ అయ్యాయే కానీ ఎలాంటి నష్టాన్ని తీసుకురాలేదు. మరోవైపు ఇప్పటికీ కథానాయకిగా ఛాన్సులు కూడా దక్కించుకోవడం విశేషం. ఈ అమ్మడు బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో ప్రేమలో పడిన తర్వాత కాస్త అవకాశాలు తగ్గినా.. ఆమె క్రేజ్ మాత్రం కొంచెం కూడా తగ్గలేదు. ఇందుకు కారణం ఆమె ఇప్పటికీ ఐటమ్ సాంగ్స్‌కు స్పెషలిస్ట్ అనిపించుకోవడమే. ఈమె హిందీలో ప్రత్యేక పాటలో నటించిన స్త్రీ చిత్రం కానీ, తమిళంలో రజనీ కాంత్ కథానాయకుడిగా నటించిన జైలర్ చిత్రంలో స్పెషల్ సాంగ్‌తో పాటు గెస్ట్‌గా నటించిన పాత్ర కానీ ఆ చిత్రాల విజయాలకు కొమ్ము కాశాయని చెప్పక తప్పదు. చాలా కాలం నుంచి ఈమెను అందరూ మిల్కీ బ్యూటీ అని పిలుచుకుంటారు. అందుకు తగిన గ్లామర్ ఆమెలో ఉందని కూడా చెప్పవచ్చు. ఇటీవల ఒక సమావేశంలో తమన్నా మాట్లాడుతూ.. మిల్కీ బ్యూటీ అనే పట్టం తనకు మొదట్లో అభిమానులు ఇచ్చారని గుర్తుచేసుకుంది. ఆ తర్వాత మీడియా దాన్ని ఎక్కువగా వాడటంతో ఆ పదం చాలామందికి దగ్గరైంది. దానివల్ల తాను ఇబ్బందులు పడ్డానని అనుకున్నారు. కానీ, అందులో ఎలాంటి నిజం లేదు. అలా పిలుస్తే ఎవరికి ఇష్టం ఉండదొ చెప్పండి అంటూ నవ్వేసింది. అదేవిధంగా అందంగా ఉండడంతోనే మంచి అవకాశాలు తనకు రాలేదని గుర్తు చేసింది. తాము పనిచేస్తోంది రంగుల ప్రపంచంలో అని, ఇక్కడ అందుకు తగ్గట్టుగా అందంగా ఉండాలని, అందుకోసమే తాను నిరంతరం ప్రయత్నిస్తున్నానని తమన్నా పేర్కొంది. తాజాగా కథానాయకిగా నటించిన తెలుగు ఓదెల-2 ఇటీవల తెరపైకి వచ్చింది.

## మార్పులు... చేర్పులు

ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం గురించి ఆసక్తి కరంగా ఎదురు చూస్తుంటారు. ఈ ఏడాది మార్చి 2న 97వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజిల్స్‌లో ఘనంగా జరిగింది. కాగా 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన కీలక తేదీలు, కొన్ని కొత్త నియమ-నిబంధనలను అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సంస్థ ప్రకటించింది. 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15 (ఆదివారం)న నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16 ఉదయం). ఇంకా ఆస్కార్ గవర్నర్ అవార్డ్స్ ప్రదానోత్సవాన్ని ఈ ఏడాది నవంబరు 16న నిర్వహించనున్నామని, డిసెంబరు 16న షార్ట్ లిస్ట్ జాబితాను వెల్లడిస్తామని, 2026 జనవరి 22న నామినేషన్స్‌ను ప్రకటిస్తామని అకాడమీ ప్రతినిధులు తెలిపారు. 2026 ఫిబ్రవరి 26న మొదలయ్యే ఫైనల్ ఓటింగ్ మార్చి 5న ముగుస్తుందని, 'అచీవ్‌మెంట్ ఇన్ క్యాస్టింగ్' అనే కొత్త విభాగాన్ని చేర్చామనీ, ఇంకా పలు విషయాలను అకాడమీ ప్రతినిధులు ఈ విధంగా పేర్కొన్నారు.

**అన్ని సినిమాలు చూడాల్సిందే!**

ఆస్కార్ అవార్డ్స్ కోసం ఫైనల్ ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులు ఏ విభాగానికి అయితే ఓటింగ్ చేస్తున్నారో ఆ విభాగంలోని అన్ని చిత్రాలను చూసినట్లుగా అధికారికంగా ధ్రువీకరించేలా ఆస్కార్ కమిటీకి ఆధారాలు చూపాలి. అన్ని విభాగాలకు ఓటింగ్ చేయాలనుకుంటే, అన్ని విభాగాల్లోని చిత్రాలను ఫైనల్ రౌండ్‌లో పాల్గొనే ఆస్కార్ ఓటర్స్ కచ్చితంగా చూడాలి. ఫైనల్ రౌండ్‌లో ఓటింగ్ చేసే ఓటర్స్ సినిమాలను చూస్తున్నారో? లేదో ఆస్కార్ అకాడమీ స్క్రీనింగ్ రూమ్ ప్రతినిధులు గమనిస్తారు. ఒకవేళ ఓటర్స్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లేదా మరేదైనా సందర్భంలో ఆస్కార్ నామినేషన్ చిత్రాలను చూసినట్లయితే ఆ ఆధారాలను కమిటీకి అందజేయాలి. ఆస్కార్ ఓటర్స్ దాదాపు పదివేల మంది ఉన్న విషయం తెలిసిందే.



## ఇది క్షమించరాని చర్య.. మా గుండె పగిలిపోయింది

### - చిరంజీవి, ఎన్టీఆర్

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల ఘటనపై సినీ హీరో చిరంజీవి స్పందించారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో దుండగులు అతి సమీపం నుంచి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడికి దిగారు. ఇప్పటికి 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం సమీప బైసరన్ లోయలో ఈ హృదయ విదారకమైన ఘటన జరిగింది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అంటూ చిరంజీవి సోషల్‌మీడియా ద్వారా తెలిపారు.

**జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది అమాయక ప్రజలతో పాటు పర్యాటకులను కాల్చి చంపడం క్షమించరాని క్రూరమైన చర్య. ఈ దారుణమైన దాడి చాలా భయంకరమైనది. ఘటనకు సంబంధించిన విషయాలను చూస్తుంటే గుండె పగిలిపోయింది. మరణించిన వారి కుటుంబాలకు బరువెక్కిన హృదయంతో సానుభూతి తెలియజేస్తున్న. ఆ కలిగిన నష్టాన్ని ఏదీ పూడ్చలేదు. - చిరంజీవి**

**పహల్గాం దాడి గురించి తెలిసి నా గుండె ముక్కలైంది. బాధితుల కుటుంబాలందరికీ, వారి బంధువులందరికీ నా సానుభూతి తెలియచేస్తున్నాను. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. నిజంగా ఈ దుర్ఘటన హృదయ విదారకం. - అల్లు అర్జున్**

**పహల్గామ్ దాడిలో మరణించిన వారిని చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. ఇప్పుడు నా ఆలోచనలు అన్నీ ఆ కుటుంబాల చుట్టే తిరుగుతున్నాయి. మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, ఆపై వారి కుటుంబాలకు న్యాయం జరగాలని ప్రార్థిస్తున్నాను. - ఎన్టీఆర్**

**ఇది చీకటి రోజు... పహల్గామ్‌లో జరిగిన దాడితో చాలా బాధపడ్డాను.ఇలాంటి క్రూరత్వానికి వ్యతిరేకంగా కలిసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నాను..ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు మరియు ప్రార్థనలు బాధిత కుటుంబాలతో ఉన్నాయి- మహేశ్ బాబు**

**మూడు నెలల క్రితం మేము అక్కడే ఉన్నాము. దాదాపు 20 రోజుల పాటు 200 మందికి పైగా అక్కడే గడిపాం. పహల్గాం ఒక కలలా ఉంది. ఆ ప్రదేశం మాదిరే అక్కడి ప్రజలను కూడా మరిచిపోలేం. ఈ ఘటన గురించి తలుచుకుంటే హృదయం విరిగిపోయింది. పంచుకునేందుకు మాటలు కూడా రావడం లేదు. -నాని**

## క్రీడా వార్తలు | SPORTS NEWS

## రోహిత్, సూర్య మెరుపులు..

### ఎస్ఆర్‌హెచ్‌పై ముంబై విజయం



ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ముంబై విజయభేరి మోగించింది. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 15.4 ఓవర్లలోనే చేధించింది. ముంబై బ్యాటర్లలో రోహిత్ శర్మ(46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. సూర్యకుమార్ యాదవ్(19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40 నాటౌట్) మెరుపు మెరిపించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఉనద్కట్, మలింగ, అన్సారీ తలా వికెట్ సాధించారు.

**క్లాసెన్ విరోచిత ఇన్నింగ్స్ వృథా..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 13 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఎస్ఆర్‌హెచ్‌ను క్లాసెన్ విరోచిత పోరాటంతో ఆదుకున్నాడు. కేవలం 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 71 పరుగులు చేశాడు. అతడితో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభినవ్ మనోహర్ కీలక నాక్ ఆడాడు. 37 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. చాహర్ రెండు, బుమ్రా, హార్దిక్ తలా వికెట్ సాధించారు.

## హల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం



పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు (ఏప్రిల్ 23) ఐపీఎల్‌లో జరుగబోయే సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌కు ముందు ఓ నిమిషం మౌనం పాటించాలని నిర్ణయించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు, మ్యాచ్ అఫీషియల్స్ నల్లటి బ్యాండ్లు ధరించాలని పిలుపునిచ్చింది. మ్యాచ్ సమయంలో బాణసంచా కాల్చకూడదని గైడ్ లైన్స్ జారీ చేసింది. మ్యాచ్ సందర్భంగా చీర్ లీడర్ల ప్రదర్శనలు ఉండవని స్పష్టం చేసింది. కాగా, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో నిన్న (ఏప్రిల్ 22) మధ్యాహ్నం భయానమైన ఉగ్రవాద దాడి జరిగింది. పహల్గామ్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం సమీపంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులు. 2019 పుల్వామా దాడి తర్వాత కశ్మీర్‌లో జరిగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడి ఇదే. ఈ విషాద ఘటనతో దేశం మొత్తం నిర్ఘాంతపోయింది. ఈ ఉగ్రదాడిని యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండించింది. బీసీసీఐ సహా భారత క్రికెటర్లు బాధితులకు నివాళులర్పించి, సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉంటే, ఇవాళ (ఏప్రిల్ 23) రాత్రి హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తలపడటం ఇది రెండోసారి. ఏప్రిల్ 17న తమ హోం గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ముంబై హైదరాబాద్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ తప్పక గెలవాలి. ఈ మ్యాచ్‌లో ఓడితే సన్‌రైజర్స్ అనధికారికంగా లీగ్ నుంచి నిష్క్రమించినట్లే. ఈ మ్యాచ్ ముంబై ఇండియన్స్‌కు కూడా కీలకమే. ఆ జట్టు కూడా ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఐదింట ఓడి పాయింట్ల పట్టికలో చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. ముంబై 8 మ్యాచ్‌ల్లో 4 విజయాలు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతుంది. నేటి మ్యాచ్ సన్‌రైజర్స్ తమ సొంత ఇలాకాలో ఆడుతుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. తమ విధ్వంసకర ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో తప్పక చెలరేగుతారని సన్‌రైజర్స్ అభిమానులు ఆశిస్తున్నారు. సన్‌రైజర్స్‌కు హోం గ్రౌండ్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉంది. గతంలో ఇక్కడ ఆడిన మ్యాచ్‌ల్లో ఆ జట్టు ఆటగాళ్లు పేట్రేగిపోయారు. నేటి మ్యాచ్‌లో అదే జోరు కొనసాగిస్తారో లేదో తెలియాలంటే మరికొద్ది గంటలు వేచి చూడాలి.

**తుది జట్లు (అంచనా)**

**సన్‌రైజర్స్:** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ (WK), అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, పాట్ కమిన్స్ (c), హర్షల్ పటేల్, జీషన్ అన్సారీ, మహమ్మద్ షమీ, ఎషాన్ మలింగ

**ముంబై ఇండియన్స్:** రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ (wk), విల్ జాక్స్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (c), నమన్ ధీర్, మిచెల్ సాంట్నర్, దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా, అశ్వనీ కుమార్

## జస్ప్రీత్ బుమ్రా ట్రిపుల్ సెంచరీ..



టీమిండియా పేస్ గుర్రం, ముంబై ఇండియన్స్ స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా టీ20ల్లో 300 వికెట్ల మైలు రాయిని అందుకున్నాడు. ఐపీఎల్ 2025లో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో హెన్రిచ్ క్లాసెన్ వికెట్‌తో బుమ్రా ఈ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఫీట్ సాధించిన రెండో ఇండియన్ ఫాస్ట్ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. ఈ జాబితాలో బుమ్రా కంటే ముందు టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్(318) ఉన్నాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఐదో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. అదేవిధంగా మరో ఘనతను బుమ్రా ఈ మ్యాచ్‌లో సాధించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలింగ్ దిగ్గజం లసిత్ మలింగ(170) రికార్డును బుమ్రా సమం చేశాడు. మరో వికెట్ పడగొడితే మలింగను జస్ప్రీత్ అధిగమిస్తాడు. అయితే ఈ మ్యాచ్‌లో బుమ్రా చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో ఏకంగా 39 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు.

**భారత్ తరపున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్లు వీరే**

యుజ్వేంద్ర చాహల్ 373
పీయూష్ చావ్లా 319
భువనేశ్వర్ కుమార్ 318
రవిచంద్రన్ అశ్విన్ 315
జస్ప్రీత్ బుమ్రా 300

## బంగ్లాకు భారీ షాక్..

### జింబాబ్వే సంచలన విజయం

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు వారి సొంతగడ్డపై పసికూన జింబాబ్వే ఊహించని షాక్ ఇచ్చింది. సిల్హాట్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో జింబాబ్వే విజయం సాధించింది. 174 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే 7 వికెట్లు కోల్పోయి చేధించింది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్ (52) టాప్ స్కోరర్‌గా నిలవగా..బెన్ కుర్రాన్(44) పరుగులతో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహాది హసన్ మిరాజ్ ఐదు వికెట్లు పడగొట్టగా.. తైజుల్ ఇస్లాం రెండు వికెట్లు సాధించాడు. కాగా ఇది జింబాబ్వేకు నాలుగేళ్ల తర్వాత దక్కిన తొలి టెస్టు విజయం కావడం గమనార్హం. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. జింబాబ్వే బౌలర్లు చెలరేగడంతో తమ బౌలర్లు చెలరేగడంతో మొదటి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద్జ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. న్యాయుచి, మదెవెరె చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌటైంది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా.. వికెట్‌కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్



నగరవ (28 నాటౌట్) పర్వాలేదన్పించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ ఐదు వికెట్లతో చెలరేగగా.. నహిద్ రాణా 3, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బంగ్లా బ్యాటర్లు తీరు ఏ మాత్రం మారలేదు. సెకెండ్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ శాంటో(60), జాకీర్(58), మోమినల్(47) మినహా మిగితా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో జింబాబ్వే ముందు కేవలం 174 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి పర్యాటక జట్టు చేధించింది. బంగ్లాపై జింబాబ్వేకు ఇది రెండో టెస్టు విజయం. కాగా ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఏప్రిల్ 28 నుంచి ఛటోగ్రామ్ వేదికగా జరగనుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



## ప్రభుత్వ దావఖానలో ప్రసవాలు సురక్షితం

- అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి..
- మరిపెడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రవి

**డోర్నకల్ , మహా:** మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది తో సమీక్షా నిర్వహించామని డాక్టర్ గుగులోతు రవి తెలిపారు.వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ దవాఖానలో మొదటి మూడు నెలలో పేర్లను నమోదు అయ్యో చేసుకునే విధంగా,ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు సురక్షితమని,ప్రతి బుధవారం మరియు శనివారాలలో జరిగే పిల్లలకు ఇచ్చే వాక్సిన్ క్రమం తప్ప కుండా ఇచ్చి విధంగా చూసుకుని ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా టీబీ జబ్బు ఉన్నవారిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలన్నారు.అసంక్రిమిక వ్యాధులైన బిపి,షుగర్ ఉన్నవారికి మందులు అందజేయాలన్నారు.తెలంగాణ డైగ్నోస్టిక్ కి క్రమం తప్పకుండా రక్త నమూనాలు పంపాలన్నారు.ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు డ్రై డే పాటించాలన్నారు.ఆరోగ్య కేంద్రాలలో మందులు మరియు ఓఆర్ఎస్ ద్రావణాలు అందుబాటులో ఉండాలని,వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరడమైనది.ఈ కార్యక్రమం మంగమ్మ,సూపెర్వైసోర్ కృష్ణ, సుదర్శన్,మాధవి,లక్ష్మి,పల్లె దవాఖాన సిబ్బంది అఖిల,ఉపేంద్ర, సిరి,ఝాన్సీ,సతీష్,సాయిశ్రీ, ఏఎన్ఎం లు పాల్గొన్నారు...

## ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్
# పారదర్శకంగా జరగాలి
### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మహా;** ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన వెరిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన నివేదికల ననుసరించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుట, పరిశీలించుటకు ఎంపీడీవోలు ఎ.ఈ, ఏ.ఓ.,ఎంపీవో లను టీం గా ఏర్పాటు చేసిన బృందానికి పర్యవేక్షణ అధికారిగా మండలాల ప్రత్యేక అధికారులుగా ఉంటారని, జిల్లాలోని 11 మండలాలతో పాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 86 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించడం జరిగిందని, ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ 30 వరకు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రిమార్క్స్ కాలమ్ లో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు ఏవైన సందేహాలు ఉన్నట్లయితే ఎంపీడీవో, హౌసింగ్ పీడీల ద్వారా అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వివరాలు అన్నీ కూడా సరిగా నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ లో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అర్హులైన అత్యంత నిరుపేదలు, అసలు ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలన్నారు. వేసవి వడగాలుల దృష్ట్యా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉపాధి పనులు మరే ఇతర పనులకు వెళ్ళే అవకాశం ఉన్నందున వెరిఫికేషన్ టీం లబ్ధిదారులు ఇంటివద్ద ఉన్న సమయంలోనే వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ వెరిఫికేషన్ టీం లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లు ఐడి కార్డ్స్, క్యాప్స్, అందజేశారు ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ జి. సంధ్యా రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జడ్పి సీఈవో రాం రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, హౌసింగ్ పిడి గణపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసూన రాణి, జిల్లా అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ బ్యాగులు నిషేధించండి
# క్లాత్ బ్యాగులు వాడండి
### ఇఫో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజల ఆరోగ్యం పర్యావరణంతో ముడిపడివుందని ఇపో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని జన్నూర్ గృహకల్ప రాగన్నగూడలో ఇపో ఆర్గనైజర్ పి శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం దరిత్రి దినోత్సవాని పురస్కరించుకొని జరిగిన మహిళల సమావేశంలో శివకుమార్, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... తమ ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యాంగా ఉంటారని అన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్ లను ఉయోగించడం మానేసి క్లాత్ బ్యాగ్ లను ఉయోగించాలని చెప్పారు. ఒక ప్లాస్టిక్ కవర్ జీవితకాలం 200 సంవత్సరాలనుండి 400 సంవత్సరాల వరకు ఉంటుందని, పర్యావరణాన్ని కాపాడుకోవటం మన అందరి బాధ్యత అన్నారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్నా పర్యావరణ విధ్వంసం సరైనది కాదని, పర్యావరణనికి నష్టం లేకుండా అభివృద్ధి ఉండాలని అన్నారు. భూమి, నీరు, గాలి,



వెలుతురూ, వృక్షాలు ఎవరు సృష్టించలేదని, వాటిని హరించే హక్కు కూడ ఎవరికీ లేదని అన్నారు. కొంతమంది స్వార్ధ ప్రయోజనాలకోసం సమస్త జీవులకు హాని చేకూర్చడం మంచిది కాదని అన్నారు. అనంతరం మహిళలకు క్లాత్ బ్యాగ్ లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రోజరాణి, శశికళ, శివ ప్రసాద్, డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకులపై దాడి హిందుస్థాన్ సహించదు
### పహల్గామ్ దాడులకు ప్రతీకారం తప్పదు
బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.. బీజేపీ జిల్లా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**వరంగల్, మహా;** పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశ హృదయాన్ని కలిచివేసింది. మానవత్వం లేని మృగాలు చేసిన పిరికిపంద చర్యగా వరంగల్ బిజెపి అధ్యక్షులు ఘంట రవికుమార్ అభివర్ణించారు. పర్యాటకుల పై జరిగిన ఈ అమానుష దాడిలో 27 మంది అమాయక హిందువులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం బాధాకరమైన సంఘటన అని ఆయన అన్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన గంట రవికుమార్ వారి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద ఘటనను తీవ్రంగా ఖండించారు. బుధవారం సాయంత్రం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి పాపయ్యపేట చమన్ వరకు మౌనంగా చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీ దేశమంతటా చలించిపోయేలాఝ చేసింది. ఈ శాంతి ప్రదర్శనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ కొవ్వొత్తుల ర్యాలీ



లో పాల్గొని మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.

## సిగ్నల్ జంక్షన్ లలో నీడతెరల ఏర్పాటు
### గ్రేటర్ వరంగల్ ప్రధాన కూడళ్లలో తెరల ఏర్పాటు

**వరంగల్ మహా;** బల్దియా పరిధి లోని ప్రధాన కూడళ్లలోని సిగ్నల్ జంక్షన్ లలో కమిషనర్ ఆదేశం మేరకు నీడ తెరలను ఏర్పాటు చేస్తున్నట్లు బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యం లో సిగ్నల్ జంక్షన్ లు గల ప్రాంతాల్లో సిగ్నల్ పడిన పుడు వాహనదారులు గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి ఉండాల్సి వస్తుందని, వేసవి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయి కి చేరుకునే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తాత్కాలిక ఉపశమనం కోసం బల్దియా పరిధి హన్మకొండ ప్రాంతం లోని ప్రధాన కూడళ్లు ఐన అదాలత్ జంక్షన్ పోలీస్ హెడ్ క్వార్టర్ జంక్షన్ అశోక జంక్షన్ ములుగు రోడ్ జంక్షన్ కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ తో పాటు వరంగల్ లోని కాశిబుగ్గ, పోచమ్మ మైదానం జంక్షన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు.

## జాతరను విజయవంతం చేసిన భక్తులకు కృతజ్ఞతలు
### ఆలయ ధర్మకర్త రామసహాయం సత్యనారాయణ రెడ్డి

**డోర్నకల్ , మహా:** మరిపెడ మండలంలోని తానంచర్ల శివారు పాలేరు నది ఒడ్డుపై స్వయంభుగా వెలిసిన గంగ భవాని జాతరకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చి గంగమ్మ తల్లిని ఆరాధించి మొక్కులు చెల్లించుకున్న భక్తులకు ఆలయ ధర్మకర్త రామ సహాయం సత్యనారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. తానంచర్ల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్,ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారన్నారు. జాతరలో ఆలయ స్థల దాత స్వర్గీయ రామసహాయం రంగారెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి గంగా భవాని తల్లి భక్తులకు మంచినీటిని అందజేశామన్నారు.. అశేష భక్తజనంతో గంగా భవాని ఆలయం కిక్కిరిసిపోయిందన్నారు.. రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే గంగాభవాని జాతరకు అశేష జనం రావడం అభినందించెదగా విషయమన్నారు.గంగాభవాని జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన పోలీస్,రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రజా ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు,యాదవ పెద్దలకు, తానంచర్ల గ్రామ ప్రజానీకానికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు...





## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర.. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ఘన్ పూర్ (కా టా రం), మహా :** రబీ సీజన్ వరి ధాన్యం విక్రయించడం లో రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులకు సూచించారు. బుధవారం సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదే విధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**తొర్రూర్ మహా:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పత్తేపురం గ్రామంలో రైతుల కోసం పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందని పిఎసిఎస్ డైరెక్టర్ జనార్దన్ రాజు మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్ అన్నారు ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని, పంటలకు తగిన మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తేవచ్చని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మధ్యవర్తుల పాత్రను తొలగించి రైతులకు నష్టాలు లేకుండా నేరుగా లాభాలు పొందేలా సన్నధాన్యానికి రూ.500 బోనస్



కూడా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్చార్జి ప్రశాంత్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాజీ సర్పంచ్ వెంకన్న నాయకులు రైతులు నాగిరెడ్డి, కొండ యాకన్న, మాధవరెడ్డి, మహేందర్ రెడ్డి, రవి , అశోక్, మల్లారెడ్డి, సమ్మయ్య, మోహన్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కామ్రేడ్ దేవన్న మరణం కుటుంబానికి,
# పార్టీకి తీరని లోటు

**డోర్నకల్,మహా:**తాళ్ల ఊకల్ గ్రామం మరిపెడ మండలానికి చెందిన, సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి కా పుల్లూరు దేవన్న గారి పార్థివా దేహానికి పూలమాల వేసి నివాళులు, హార్పిస్తున్న, పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కా సార్ణాపు సోమయ్య గారు & అల్వాలా వీరయ్య గారు, దేవన్న నూ ఉద్దేశించి మాట్లాడుతూ, దేవన్న పార్టీ లో 1996 లో చేరడం జరిగింది, గ్రామం లో వార్డ్ నెంబర్ గా పని చేసాడని తరలియజేసాడు, పార్టీ గ్రామ కార్యదర్శి గా, మండల కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా, పి ఎన్ యం కళాకారుడిగా దేవన్న పని చేసాడని వీరయ్య గుర్తు చేసాడు.దేవన్న మరణం ఊకల్ మరియు మండల పార్టీ కి తీరని లోటు అనీ మండల కార్యదర్శి మధుసూదన్ ఆవేదన వ్యక్తం చేసాడు. గ్రామం లో కష్ట కాలం లో పార్టీ కి అండగా ఉన్నాడని వివరించారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాణాల రాజన్న,నాయకులు కుర్ర మహేష్, కడియం సత్యం, దిగజర్ల బాబు, దేవన్న సతీనామీ పద్మ, కుమారుడు క్రాంతి, మండల కమిటీ సభ్యులు బోడపట్ల రాజశేఖర్, రమేష్ పాల్వాయి దుర్గయ్య, కాందాల శ్రీను చిన్నబోయిన వెంకన్న, అల్లి శ్రీనివాస్ రెడ్డి,బాబు పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుంది
నాయకులు సమన్వయంతో పనిచేయాలని కేటిఆర్ పిలుపు

బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన కేటీఆర్



**హన్మకొండ మహా;** ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున జన సమీకరణ ఏర్పాట్లు చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను ఆదేశించారు. ఈనెల 27 న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్ర లో నిలిచిపోతుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తిలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం హనుమకొండలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో ఉమ్మడి జిల్లా కు చెందిన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనసమీకరణకు జరుగుతున్న ఏర్పాట్లపై పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లాలో పర్యటించి అవసరమైన సూచనలు, సలహాలు అందజేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్





**వరంగల్ మహా;** పర్వతగిరి మండల కేంద్రంలో బుదవారం చెనిమాల పుష్ప నర్సయ్య సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు భోజనం చేశారు. అన్నదాత సుఖీభవ అని దీవిస్తూ దంపతులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీరను బహుమానంగా సమర్పించగా, ఎమ్మెల్యే ఇంటి ఆడపడుచుల కట్నం పెడుతూ వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు
# ప్రభుత్వ పథకాలు అందిద్దాం

**తొర్రూరు, మహా ;** తొర్రూరు మండలం లో జరుగుతున్న అభివృద్ధి మరియు ప్రతి ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందిద్దామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో గల ఎమ్మెల్యే నివాసంలో తొర్రూరు మండల ముఖ్య నాయకులతో సమావేశమయ్యి తొర్రూర్ మండల, పట్టణ అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులకు అన్యాయం జరగొద్దన్నారు. పార్టీ పరమైన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకొని మన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. అలాగే, తొర్రూర్ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను వివరించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే ప్రతి కార్యకర్తకు పూర్తిగా అండగా



ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీకి ద్రోహం చేసే వారికి కఠినంగా ఎదురు తిరుగుతామన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు చైతన్యవంతులు అని, ఎవరు ఏంటో ప్రజలకు తెలుసని, ప్రతిపక్షాలను ఎవరు పట్టించుకోవడం లేదన్నారు ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి ని మనమంతా ప్రజలకు చెప్పాలి అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాలేశ్వరంలో అభివృద్ధి పనులకు మే 10 డెడ్ లైన్

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో మే 15 నుండి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి పుష్కరాల కోసం జరుగుతున్న అభివృద్ధి పనులను మే 10వ తేదీ లోపు పూర్తి చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ శ్రీమతి అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే జిల్లా అధికారుల తో కలసి విఐపి ఘాట్, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు, 100 గదుల సత్రం అభివృద్ధి పనుల పనితీరును పరిశీలించారు. అభివృద్ధి పనులు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, పనులను క్యాజువల్ గా తీసుకోవద్దు ... సీరియస్ గా తీసుకుని పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను, కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖల వారిగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పూర్తి చేయుటపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 10 రోజులు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రోజు పనులలో ప్రగతి రావాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల ప్రగతి, పనులు వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయాలని సూచించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటు మే మొదటి వారం వరకు పూర్తి చేయాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమయం సమీపిస్తున్నదని పనుల్లో వేగం పెంచాలని, రేయింబవళ్లు పనులు జరిగితే తప్ప పనులు పూర్తి కావని, ఆశించిన స్థాయిలో వేగంగా పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మే మొదటి వారం వరకు 7 హారతి ప్లాట్ ఫార్మ్ కుడా పూర్తి చేయాలని తెలిపారు. ఘాట్, సరస్వతి విగ్రహం, సత్రం పనులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పనులు పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా నియమించి నిరంతరం పనులను పర్యవేక్షణ చేయు విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 10వ తేదీ వరకు అన్ని పనులు పూర్తి కావాలని, ఇంజినీరింగ్ అధికారులు పనులు పూర్తి చేయుటకు టైం షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కార్యక్రమమని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద శాశ్వత మరుగుదొడ్లు, షవర్స్, భక్తులు బట్టలు మార్చుకునే గదులు 12 వ తేది వరకు ఫుల్ షేప్ లో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భక్తులు నది వరకు వెళ్ళడానికి అనువుగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, వేసవి దృష్ట్యా నదిలోకి భక్తులు వెళ్ళడానికి అనువుగా అనువుగా క్వయర్ మాట్ ఏర్పాటు చేయుటలో అవగాహన లేకుండా ఎందుకు చెప్తున్నారని పీఆర్ ఈఈపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విఐపి ఘాట్ వద్ద అదనంగా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని ఆర్ డబ్ల్యూఎస్ ఈఈకి సూచించారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ తరలించడానికి 4 వాహనాలు సిద్ధంగా ఉంచాలని, గోతిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వేసి పూడ్చాలని సూచించారు. విఐపి ఘాట్ వద్ద లైటింగ్ పనులు 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద 100 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు 125 కెవి జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విఐపి ఘాట్ వద్ద సూచన చేసిన ప్రకారం మొక్కలు నాటాలని మే 10 వరకు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఘాట్ పైన చలువ పందిళ్లు వేయాలని సూచించారు. ఏదేని సమస్య ఉంటే తెలియచేయాలని, చెప్పకుండా మీలోనే దాచుకుంటే ఎలా చెప్పండి, సమస్య అలానే ఉంటుంది భక్తులు ఇబ్బందులు పడతారు, అందుకే సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు పూడికతీతలో వేగం పెంచండి

### కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే

### క్షేత్రస్థాయిలో పూడికతీత పురోగతిని పరిశీలించిన వీసీ

**వరంగల్ మహా;** భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలని కుడా వైస్ చైర్మన్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూడిక తీత లక్ష్యం కాగా ఇప్పటివరకు చెరువులో రెండు లక్షల క్యూబిక్ మీటర్ల డిసిల్టేషన్ చేయడం జరిగిందని అధికారులు వైస్ చైర్మన్ కు వివరించగా, పనుల్లో మరింత వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం పేద రైతుల చుట్టం

### భూ భారతి చట్టం రైతుల హక్కులను కాపాడే చట్టం.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ మహా;** గత ప్రభుత్వం భూస్వాముల కోసమే ధరణి తీసుకువచ్చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథ పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగహన సదస్సులో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు రైతులకు వివరించారు. రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10లక్షల సాదా బైనామా దరఖాస్తులను పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా మార్గం సుగమం అయిందని తెలిపారు. అలాగే పార్ట్ బీ 18లక్షల ఎకరాలకు సంబందించిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందని అన్నారు. భూ విస్తీర్ణం లో మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్, సవరణలు లాంటి ప్రతి సమస్యకి మీ సేవ ద్వారా కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకునేలా భూ భారతి పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి వ్యక్తి ఆధార్ ఉన్నట్లుగా ప్రతి భూమికి భూదార్ అనే యూనిక్ నంబర్ ఇచ్చి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూ భారతి పోర్టల్ లో అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా పొందవచ్చు అని అన్నారు. జూన్ 2 నుండి ఆన్ లైన్ లో భూభారతి చట్టం రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యుటీ కలెక్టర్, ఆర్డివో, తహసీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ నూతన బ్యాంక్ ప్రారంభం

### తుర్కయంజాల్ మున్సిపాలిటిలో పదవ బ్రాంచ్

### నూతన బ్యాంకును ప్రారంభించిన మల్ రెడ్డి రాంరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తుర్కయంజాల్ లో పదవ శాఖ బ్యాంకును రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీఎస్ సిఏబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరయ్యారు. బుధవారం తుర్కయంజాల్ లో నూతనంగా ఏర్పాటు అయినా పోచంపల్లి అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు తడక రమేష్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిధులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రంలో డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు మల్ రెడ్డి రామ్ రెడ్డి బ్యాంక్ యొక్క లావాదేవీలు, లోనింగ్ మరియు వాటి పనితీరుని అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలని బ్యాంకు నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక మాజీ కౌన్సిలర్ ధనరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి, పోచంపల్లి బ్యాంక్ వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు మరియు బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ప్రజా సమస్యలపై సీపీఎం పాదయాత్ర - మహాధర్నా

### గుండు వెంకటనర్సు.. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రం జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యల సాధనకై, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం పార్టీ కార్యాలయం నుండి పాదయాత్ర చేస్తూ, కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. మోత్కూర్ మండలం రాగిబావి గ్రామంలో ధర్నాకు సంబందించిన కరపత్రం విడుదల చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ. జిల్లాకు సాగునిరందించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్ ప్రాజెక్ట్ లు దశాబ్దాలు గడచిన పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, పేదలకు విద్యా, వైద్యం, ఉపాధి కల్పించడంలో, పెరిగిన ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయని విమర్శించారు. గత కొన్నేండ్లుగా బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేసి ఆత్మకూర్ (ఎం) మోత్కూర్, అడ్డగూడూరు మండలాలకు సాగు, త్రాగు నీరు అందించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించటతో పాటు, అడ్డగూడూర్ నుండి కలెక్టరేట్ వరకు బైకు ర్యాలీ నిర్వహించటం జరిగిందని తెలిపారు. ఫలితంగా నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటన చేసినా, ఇప్పటికి పనులు ప్రారంభించలేదని అన్నారు. మోత్కూర్ మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ, 30 పడకల ఆసుపత్రి, బస్సుడిపో, రెవిన్యూ డివిజన్ లాంటి అనేక ప్రజా డిమాండ్లు నేటికీ నెరవేరలేదని, మోత్కూర్ పట్టణ కేంద్రంలోని కాషావాడలో రేషన్ షాపు ఏర్పాటు చెయ్యాలని కాలనీ వాసులు కోరుతున్నారని, ఎన్నికలప్పుడు హామీలే తప్ప, ప్రభుత్వాలు, పాలకులు మారిన హామీల అమలులో ఏలాంటి పురోగతిలేదని అన్నారు. పై సమస్యలతో పాటు, జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యల సాధన కోసం ఈ నెల 28 న కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాలో పార్టీలకు అతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, పానుగుల రమేష్, ఎన్నం వెంకట్ రెడ్డి, గానగాని అండాలు, పసునూరి రాములమ్మ, ఎన్నం కలమ్మ, మెండు లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.





## వెల్లటూరు ఇండ్లు వైపు చెలరేగిన మంటలు

**హుజూర్ నగర్, మహా :** చెలరేగిన మంటలు ఇండ్ల వైపు వ్యాపించడంతో గ్రామస్తులు భయాందోళన గురైన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో పరిస్థితి తీవ్రం అవ్వడంతో గ్రామస్తులు ఫైర్ స్టేషన్కు సమాచారం అందజేశారు.మేళ్లచెరువు పోలీస్ వారి సహాయంతో,మహా సిమెంట్ ఇండిస్ట్రీ వారి ఫైర్ ఇంజిన్ తో మంటలును అదుపుజేశారు. దీంతో మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## సింథటిక్ ఇంజేక్షన్స్, స్టెరాయిడ్స్ పై అవగాహన సదస్సు

### నార్కోటిక్ కె.డీఎస్పీ సైదులు

**వరంగల్ మహా:** నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు ఎస్పీ రూపేష్ ఐపీఎస్ పర్యవేక్షణలో బుధవారం నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, వరంగల్ హన్మకొండ పట్టణ పరిధిలోని జిమ్ యజమానులను కోచ్‌లకు మాదకద్రవ్యాలు, సింథటిక్ ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ కు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎస్పి సైదులు మాట్లాడుతూ ఎవరైనా స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే చట్టరీత్య చర్య తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. ఈ సదస్సులో జిమ్‌ల రికార్డుల నిర్వహణ, గంజాయి ఇతర మాదకద్రవ్యాల కొనుగోలు, అమ్మకం, రవాణా, వాడకంపై స్టెరాయిడ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. వినియోగదారుల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డుల సేకరణ, జిమ్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ గురించి తగు సూచనలు చేశారు. ఇందుకోసమే నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేయబడిందని తెలిపారు. దీనిని నిరోధించడం ప్రతీ పౌరుడి బాధ్యతని రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుండి రక్షించేందుకు ప్రతి ఒక్కరు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎవరైన గంజాయి డ్రగ్స్ కి సంభందించిన అమ్మకాలు, కొనుగోలు, త్రాగే వారి వివరాలు తెలిసినచో, టోల్ ఫ్రీ నంబర్: 1908, టీజీఏ ఎన్బి కంట్రోల్ రూమ్ నంబర్ 8712671111 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నార్కోటిక్ డీఎస్పీ కె సైదులు, ఇన్స్పెక్టర్ బి రవిందర్, మట్టేవాడ ఇన్స్పెక్టర్ గోపి, నార్కోటిక్ ఎస్సై రాజు, సిబ్బంది, పాల్గొన్నారు.




## చనిపోయిన వారందరికీ ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం జమ్మూ కాశ్మీర్ లో జరిగిన హిందువులే లక్ష్యంగా ఇస్లామిక్ తీవ్రవాదులు పర్యటకులను విచక్షణ రహితంగా కాల్చి చంపడాన్ని నిరసిస్తూ. చనిపోయిన వారందరికీ ఆత్మకు శాంతి కలగాలని స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి చెరువు కట్ట వరకు కొవ్వొత్తుల ప్రదర్శన బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులను ఇస్లామిక్ తీవ్రవాదులు హిందువులని నిర్ధారించుకున్న తర్వాతనే చంపివేశారని ఆరోపించారు దేశంలో మెజార్టీ అయిన హిందువులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు మైనార్టీలకు ఏదైనా అన్యాయం జరిగితే సహించలేని సెక్యులర్ పార్టీల నాయకులు ఈ సంఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు సెక్యులర్ అని చెప్పుకునే పార్టీలకు హిందువుల ఓట్లు కావాలి కానీ వారి ప్రాణాలు అక్కర్లేదా అని ప్రశ్నించారు దేశంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న పూర్తి స్థాయిలో రూపు మాపవలసిందేనని ఈ ఉగ్రవాదాన్ని ఆపకపోతే హిందువులే తీవ్రవాదులుగా మారే ప్రమాదం ఉందని అన్నారు ఈ ఉగ్రవాదులదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి మోత్కూర్ పట్టణ అధ్యక్షులు, చాడామంజుల జిల్లా నాయకులు, కొనతం నాగార్జున రెడ్డి, శ్రీనివాస్, పోచం సోమయ్య, చేకూరి మల్లేశం, కందుకూరి ప్రకాష్, ఎడ్ల రాము, ముత్తినేని తిరుమలేష్, కాంభోజు మహేందర్, తీగల శ్రీధర్ గౌడ్, అన్నపు సత్యనారాయణ, మహిళా మోర్చా నాయకులు, కొత్తకొండ ఉషారాణి, మధు సోమేశ్వరి, టంగుటూరు వెంకన్న, బీసు మధు, వనం అంజయ్య, బద్దం మహేందర్, రెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.




## మ్యాజిక్ మనీ పేరుతో మాయాజాలం

**హైదరాబాద్:** మ్యాజిక్ మనీ పేరు తో టోకరా పెట్టిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దుద్దాల సాయి కళ్యాణ్ అనే వ్యక్తి ఒక సంవత్సరం నుండి ఆనంద్ అనే వ్యక్తితో స్నేహం చేస్తున్నాడు. ఆనంద్ అనే వ్యక్తికి,కందా శ్రీనివాస అనే వ్యక్తి స్నేహితుడుగా ఉన్నాడు. సాయి కళ్యాణ్ అనే వ్యక్తి నీ,కందా శ్రీనివాస్ స్నేహితుడైన ఆనంద్ కు పరిచయం చేశాడు. పరిచయం కావడానికి వారం రోజులు ముందు నుంచి ఆనంద్, సాయి కళ్యాణ్ కు మ్యాజిక్ మనీ గురించి వివరిస్తున్నాడు. ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి కోసం ఆనంద్,శ్రీనివాస్ ను కలిస్తే మ్యాజిక్ మని ట్రిక్ ద్వారా డబ్బు రెట్టింపు చేయడం శ్రీనివాస్ కు తెలుసని ఆనంద్,సాయి కళ్యాణం చెప్పడం జరిగింది. ఆనంద్,సాయి కళ్యాణ్ ను చైతన్యపురి లోని విద్యుత్ నగర్ లో ఉన్న కందా శ్రీనివాస్ ఇంటికి తీసుకువెళ్లాడు. కందా శ్రీనివాస్,రవి అనే వ్యక్తి కి ఫోన్ చేసి విద్యుత్ నగర్ కి రమ్మన్నాడు. రవి అనే వ్యక్తి మీరు ఎంత డబ్బు ఇస్తే అంత రెట్టింపు చేస్తానని సాయి కళ్యాణ్ కు చెప్పగా రవి మాటలు నమ్మి ఆనంద్,శ్రీనివాస సమక్షంలో సాయి కళ్యాణ్ లక్ష 75000 రూపాయలు ఇచ్చాడు. ఆ డబ్బును ఐదు లక్షలు చేస్తానని రవి చెప్పి ఆ డబ్బునంత బ్రౌన్ కలర్ బాక్సులు పెట్టి, పైన ఆకుపచ్చ రంగు టేపుతో చుట్టి,దానికి పింక్ ఇంజక్షన్ ఇచ్చి కందా శ్రీనివాస్ ఫ్రిడ్జ్ లో పెట్టి సాయంత్రం తిరిగి వస్తానని రవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం రవి తిరిగి రాకపోవడం తో,కాల్ చేయగా అతని మొబైల్ స్విచ్ ఆఫ్ ఉంది. అతని నుండి ఎలాంటి సమాచారం అందలేదు రెండు రోజుల తర్వాత కందా శ్రీనివాస్ ఫ్రిడ్జ్ లో పెట్టిన బాక్సుల ను తీసి సాయి కళ్యాణ్ ఇంటికి తీసుకువచ్చాడు. వారు దాన్ని తెరిచి చూడగా పెట్టిన డబ్బుకు బదులు తెల్ల కాగితాలు ఉన్నాయని గమనించారు. సాయి కళ్యాణ్ తన మోసపోయినట్టు గ్రహించి తన మోసం చేసే డబ్బు తీసుకుపోయిన రవి పై చర్యలు తీసుకోవాలని చైతన్యపురి పోలీసులకు సాయి కళ్యాణ్ ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు.

## వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన

### పాల్గొన్న ఆలయ ఈవో, కార్పొరేటర్, సీనియర్ నాయకులు

**వరంగల్ మహా ;** వరంగల్ నగరంలోని ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ధ్వజస్తంభ దాత కల్వచర్ల వంశీకృష్ణ, ఆలయ అర్చకులు, ముదిరాజ్ రథసారధి, సీనియర్ నాయకులు చింతాకుల సునీల్ కుమార్, రథసారధుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యావాదాలు తెలిపారు. ముఖ్యంగా ధ్వజస్తంభాన్ని గోవిందరాజుల గుట్ట పైకి తీసుకు వెళ్లడానికి భక్తులు పడ్డ కష్టాన్ని, ఎండను సైతం లెక్కచేయకుండా స్థానికులు, భక్తులు ,అర్చకులు వారి వారి పనులను భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు వేణు మాధవస్వామి, వేణుస్వామి, శ్రీకాంత్ స్వామి, కిరణ్ స్వామి, అరుణ్ స్వామి, మనోహర్,భాషాపక సదానందం ,కొమ్ము రాజకుమార్, యాటా సత్యనారాయణ యాట ప్రతాప్ ,సిరబోయినమహేశ్,సాగర్, ధనలక్ష్మి ,అరుణ,పద్మ శ్రీను, రాధాకృష్ణ , మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉగ్రవాద దాడి లో హతమైన పర్యాటకులకు ప్రగాఢ సానుభూతి

### నక్కపల్లిలో జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

**అనకాపల్లి జిల్లా ,నక్కపల్లి ,మహా :** కాశ్మీర్ లో పెహల్ గాం వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో హతమైన పర్యాటకులకు నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల తో నిరసన తెలిపారు. అనంతరం నక్కపల్లి జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర ర్యాలీ చేపట్టారు. దేశ ఐక్యత కోసం జనసేన ,ఉగ్రవాద దాడులను ఖండిస్తున్నాము అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ మాట్లాడుతూ భారతదేశంలో పర్యాటకులు 29 మంది ఉగ్రవాదుల చేతులో హతం అయ్యారని తెలిసిన వెంటనే మా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని తెలిపారు. మా అధినేత ఆదేశాల మేరకు భారత దేశ ఐక్యత ను చాటిచెప్పాలి మృతి చెందిన కుటుంబాలకు సంతాపం తెలియజేయాలని ఉద్దేశించి మూడు రోజులు సంతాప దినాలుగా మా పార్టీ సంతాప కార్యక్రమాలు చేయబోతున్నామన్నారు.ఈ రోజు కొవ్వొత్తుల ర్యాలీ చేయడం జరిగిందన్నారు.రేపు నక్కపల్లి కార్యాలయం వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకూ సంతాప దీక్ష చేయడం జరుగుతుందన్నారు.అలాగే ఎల్లుండి అడ్డురోడ్డు జంక్షన్ వద్ద మానవహారం గా ఏర్పడి ఈ సంతాప కార్యక్రమం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం జనసేన పార్టీ జిల్లా నాయకులు ఉగ్రవాద చర్యల ను ఖండిస్తూ మాట్లాడారు. హిందువులు ను హతమార్చడం దారుణం అని తోట నాగేష్ అన్నారు ఇంత దారుణం నకు పాల్పడుతున్నారని ఉగ్రవాదులు అందర్నీ హతమార్చాలని దానికి జనసేన పూర్తి మద్దత్తు ప్రధాని నరేంద్ర మోడీ కు ఇస్తామని నాయకులు గోవిందరావు తెలిపారు ఈకార్యక్రమంలో సేనాపతి బాబురావు పాము గణేష్ అప్పలరాజు తోట అప్పారావు బంగారి రాజు కోసూరి నాని తులసి ఏరిపల్లి చిన్న కంబాల రాజు లోడ రవిశతీష్ తదితరులు పాల్గొన్నారు.



## భూ భారతితో రైతుల భూ సమస్యను పరిష్కారం

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**హుజూర్ నగర్,మహా:** భూ భారతితో రైతుల భూ సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని రైతులకి బహుళ ప్రయోజనాలు చేకూర్చేలా భూ భారతి చట్టం రూపొదించారాని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం మఠంపల్లి మండలం వి ఆర్ ఎస్ పంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు తాసిల్దార్ రావూరి మంగ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తాసిల్దార్ మంగ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టాన్ని ప్రభుత్వ నివేదికలో ఉన్న అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన, న్యాయమైన సేవలు అందించాలని సదుద్దేశంతో ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా భూ భారతి సేవలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి అందుబాటులోకి వచ్చాయని రైతులు ఎన్నో ఏళ్లుగా భూ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరుగుతూ డబ్బులు సమయాన్ని వృధా చేసుకోవడమే తప్ప సమస్యల పరిష్కారం కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా రైతులకు మేలు చేకూరి ప్రయోజనాలను ఒక్కో అంశంపై వివరించారు.ఈ చట్టంలో ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తమ సమస్యను దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని వివిధ స్థాయిలలో నిర్ణీత సమయాలలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుకు న్యాయం చేయడం జరుగుతుంది అని అన్నారు. భూముల సమస్య సులభంగా పరిష్కారం కోసం మార్పులు చేర్పులు (వికేంద్రీకరణ ) చేయడం జరుగుతుందన్నారు. గత ధరణి పోర్టల్ లలో రెవెన్యూ అధికారులకు ఏమాత్రం అధికారం అవకాశం లేకుండా ఉండేదని తెలిపారు. నూతన చట్టంలో అనేక సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుండి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారి, మండల సర్వేయర్లను నియమించుకోవడం కోసం సన్నాహాలు చేస్తుందన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో నూతన రికార్డుల నిర్వహణకు సులభతరంగా ఉంటుందని సూచించారు. అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ గత ధరణి సమయాలలో రైతులు చిన్న చిన్న భూ విషయాలకు చాలా ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం 2025, ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు. పిఎసిఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం అని గత 10 ఏళ్లలో ధరణి పోర్టల్ ద్వారా రైతులు నానా ఇబ్బందులకు గురి అయ్యారని వాటి నన్నిటిని దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా అధికారులు రైతులు సామాన్య ప్రజల చూచన సలహాలను ప్రభుత్వం పరిశీలన చేసి ఏ విధంగా చేస్తే భూ సమస్యల పరిష్కారం అవుతాయి అని ఒక ప్రణాళిక అబద్ధంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అధికారులు సమయమానం పాటించి రైతుల పట్ల శ్రద్ధ చూపి విధిగా పనిచేస్తే అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు రైతులు సామాన్య ప్రజల నుండి మన్ననలు పొందుతారని అన్నారు. రెవెన్యూ సదస్సుకు హాజరైన కొంతమంది రైతులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి రానున్న గ్రామసభల ద్వారా తమ సమస్యలను లిఖితపూర్వకంగా రెవెన్యూ అధికారులకు ఇవ్వాల్సిందిగా తెలిపారు. సదస్సుకు హాజరైన రైతులు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 మంచి నిర్ణయం అని రైతులు కొనియాడారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు తహసీల్దార్ మంగా, ఎంపిడిఓ జగదీష్, డి టి బాలరాజు, పి ఎ సి ఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య,వైస్ చైర్మన్ బాబు నాయక్, సీఐ చరమందరాజు, స్థానిక ఎస్సై పి బాబు, స్థానిక డిప్యూటీ తాసిల్దారులు, రెవిన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

